మార్నింగ్ కాఫీ విత్ హాట్ న్యూస్‌తో...! మీ

# డ్రీమ్ టైమ్స్

తెలుగు దిన పత్రిక

శుక్రవారం 16 -10-2026
పేజీలు: 8 వెల: రూ.2/-
సంపుటి:5 సంచిక 315

Published from Kurnool circulated all over Andhra Pradesh and Telangana All District

విలేకరులు కావలెను

తెలంగాణ ,ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా డ్రీమ్ టైమ్స్ దినపత్రికలో బ్యూరో, మండలాల రిపోర్టర్ గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయిలో ఉత్సాహవంతులైన యువతి ,యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును

8500066609

## ఉగ్రదాడులకు ఇక ఉక్కుపాదమే!

- పాక్‌కు రాజ్‌నాథ్ సింగ్ గట్టి హెచ్చరిక
- దాడులు జరిగితే దీటుగా బదులిస్తాం
- ఉగ్రవాదంపై మారిన భారత్ వ్యూహం
- శాంతిని బలహీనతగా భావించొద్దు
- ఆపరేషన్ సిందూర్‌తో సత్తా చాటిన భారత్
- ఉగ్రవాద మూలాలే లక్ష్యంగా చర్యలు
- దేశ భద్రతకు సైనిక సంసిద్ధత కీలకం
- డిజిటల్ యుగంలో కొత్త ముప్పులపై అప్రమత్తం



03

### పది నెలల్లో మోదీ ప్రభుత్వం

## కూలిపోతుంది!

- కార్యకర్తలకు రాహుల్ గాంధీ భరోసా
- భయపడొద్దు.. అండగా ఉంటా
- కేంద్రానికి వ్యతిరేకంగా యువత
- బీజేపీలో చేరిన నేతలపై వ్యంగ్యాస్త్రాలు
- ఎన్ఎస్‌యూఐ, సేవాదళ్, యూత్ కాంగ్రెస్ శ్రేణులతో టీ పార్టీ
- నిరసనల అనంతరం కార్యకర్తలతో రాహుల్ భేటీ

03






## స్థానిక పోరులోనూ టీడీపీ--జనసేన జోడీ!

- స్థానిక ఎన్నికల్లో కలిసి పోటీకి ఇరు పార్టీల నిర్ణయం
- సీట్ల సర్దుబాటు చర్చలు విజయవంతం
- గెలుపు అవకాశాలే కేటాయింపులకు ప్రాతిపదిక
- రెండు రోజుల్లో ఉమ్మడి అభ్యర్థుల జాబితా విడుదల
- కార్యకర్తల మనోభావాలకు ప్రాధాన్యమిస్తామన్న నేతలు
- కూటమిలో విభేదాల ప్రచారాన్ని ఖండించిన జనసేన నాయకులు
- పవన్ కల్యాణ్ ఆలోచనలకు అనుగుణంగా సర్దుబాటు
- 2029 ఎన్నికల్లోనూ పొత్తు కొనసాగుతుందని వెల్లడి

**అమరావతి,**

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన పార్టీలు కలిసి పోటీ చేయనున్నాయి. ఇరు పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు చర్చలు సఫలమైనట్లు జనసేన నేతలు బొలిశెట్టి శ్రీనివాస్, వంశీకృష్ణ యాదవ్, చిల్లపల్లి శ్రీనివాస్ వెల్లడించారు. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో బుధవారం రాత్రి జనసేన విప్ పి. హరిప్రసాద్, మరో నేత పెండెం దొరబాబుతో కలిసి వారు మీడియాతో మాట్లాడారు. 2024 అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే ఈసారి కూడా కలిసికట్టుగా బరిలోకి దిగుతామని స్పష్టం చేశారు. సీట్ల సంఖ్య కంటే గెలుపు అవకాశాలకే ప్రాధాన్యమిచ్చి కేటాయింపులు చేపట్టినట్లు నేతలు తెలిపారు.

-మిగతా 3 లో



03

## భారత్‌కు నేపాల్ ప్రధాని

- ప్రధానిగా బాధ్యతలు చేపట్టాక తొలి విదేశీ పర్యటన
- మూడు రోజుల పర్యటనకు సిద్ధమవుతున్న నేపాల్ ప్రధాని
- ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చలు
- భారత సీనియర్ మంత్రులతోనూ సమావేశాలు
- మౌలిక వసతులు, జలవిద్యుత్ ప్రాజెక్టులపై చర్చ
- సరిహద్దు సమస్యలపైనా చర్చించే అవకాశం
- వరదల సమయంలో భారత్ అందించిన సాయానికి కృతజ్ఞతలు
- ఇరు దేశాల సంబంధాల బలోపేతంపై దృష్టి

### మతం మారితే

## రిజర్వేషన్లు కట్



03

### మహిళలు ఉద్యోగాలిచ్చే స్థాయికి

## ఎదగాలి!

**మహిళల ఆర్థిక స్వావలంబనే ప్రభుత్వ లక్ష్యం**

- విజయవాడలో జాతీయ సరస్ మేళా--2026 ప్రారంభం
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలిసి ప్రారంభించిన చంద్రబాబు
- గ్రామీణ ఉత్పత్తులకు 'స్వయం ఏపీ' బ్రాండ్
- డ్వాక్రా సంఘాల వార్షిక టర్నోవర్ రూ.69 వేల కోట్లు
- 650 స్వయం సహాయక సంఘాలతో జాతీయ స్థాయి ప్రదర్శన
- ఈ-కామర్స్‌తో ప్రపంచ మార్కెట్‌కు మహిళల ఉత్పత్తులు
- ప్రతి గ్రామం ఉపాధి కేంద్రంగా మారాలన్న సీఎం

మహిళలు ఉద్యోగాలు కోరే స్థాయి నుంచి ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని, ఆర్థిక స్వావలంబనతో సంపద సృష్టికర్తలుగా మారాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. గ్రామీణ మహిళల ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో గుర్తింపు తీసుకువచ్చే లక్ష్యంతో 'స్వయం ఏపీ' బ్రాండ్‌ను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. విజయవాడలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలిసి జాతీయ సరస్ మేళా--2026ను ప్రారంభించిన ఆయన, రాష్ట్రంలోని 11 లక్షల స్వయం సహాయక సంఘాల వార్షిక టర్నోవర్ రూ.69 వేల కోట్లకు చేరిందని వెల్లడించారు. ఈ-కామర్స్ వేదికల ద్వారా మహిళల ఉత్పత్తులను ప్రపంచ మార్కెట్‌కు పరిచయం చేస్తామని, ప్రతి గ్రామాన్ని ఉపాధి కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని స్పష్టం చేశారు.



03

## మాంసం తినే మహిళలు వందేండ్లు బతికే చాన్స్

- వందేళ్లు జీవించే అవకాశంపై చైనా అధ్యయనంలో ఆసక్తికర అంశాలు
- శాకాహారులతో పోలిస్తే 44 శాతం అధిక అవకాశమని వెల్లడి
- 80 ఏళ్లు దాటిన ఐదు వేల మంది మహిళలపై పరిశోధన
- బరువు తక్కువగా ఉన్న మహిళల్లోనే ఈ వ్యత్యాసం
- బరువు ఎక్కువగా ఉన్నవారిలో కనిపించని తేడా
- అమెరికన్ జర్నల్ ఆఫ్ క్లినికల్ న్యూట్రిషన్‌లో ప్రచురణ

03

శాకాహారం తినేవారే ఎక్కువ కాలం జీవిస్తారన్న అభిప్రాయానికి భిన్నంగా చైనాకు చెందిన ఓ అధ్యయనం ఆసక్తికర విషయాన్ని వెల్లడించింది. బరువు తక్కువగా ఉన్న మాంసాహార మహిళలు 100 ఏళ్లు జీవించే అవకాశం, శాకాహార మహిళలతో పోలిస్తే 44 శాతం ఎక్కువగా ఉన్నట్లు తెలిపింది. 80 ఏళ్లు దాటిన ఐదు వేల మంది మహిళలపై నిర్వహించిన ఈ పరిశోధన వివరాలు లిఅమెరికన్ జర్నల్ ఆఫ్ క్లినికల్ న్యూట్రిషన్‌లిలో ప్రచురితమయ్యాయి. అయితే అధిక బరువున్న మహిళల్లో మాత్రం ఈ వ్యత్యాసం కనిపించలేదని అధ్యయనం పేర్కొంది.



## జగన్ కాక్రోచ్ జపం!

- సీజేపీ నేతల అరెస్టులకు ఖండన.. పాలనపై కేంద్రానికి హితోక్తులు
- అరెస్టులు సమస్యలను పరిష్కరించలేవు
- ఎన్నికల ప్రక్రియపై విశ్వాసాన్ని పునరుద్ధరించాలి: జగన్
- రాహుల్‌తో కలవాలంటూ జగన్‌కు వైసీపీ శ్రేణుల పిలుపు

03



### శ్రీశైలంలో వైభవంగా

## ఐదో రోజు నవరాత్రి మహోత్సవాలు

- స్కందమాత అలంకారంలో దర్శనమిస్తున్న భ్రమరాంబాదేవి.. భక్తులకు మెరుగైన సేవలే లక్ష్యంగా చైర్మన్, ఈఓ కృషి
- భక్తులకు వసతి, అన్నప్రసాదం, దర్శన సౌకర్యాలపై ప్రత్యేక శ్రద్ధ

**శ్రీశైలం, అక్టోబర్ 15:డ్రీమ్ టైమ్స్**

శ్రీశైల మహాక్షేత్రంలో శ్రీ భ్రమరాంబాదేవి అమ్మవారి నవరాత్రి మహోత్సవాలు ఐదో రోజు గురువారం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారు స్కందమాత అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. అమ్మవారి దివ్య మంగళ స్వరూపాన్ని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు శ్రీశైలానికి తరలివస్తుండటంతో క్షేత్రంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. అమ్మవారికి నిర్వహిస్తున్న విశేష పూజలు, అలంకరణలు నవరాత్రి ఉత్సవాలకు ప్రత్యేక శోభను తీసుకొస్తున్నాయి. నవరాత్రి మహోత్సవాలను విజయవంతంగా నిర్వహించడంతో పాటు శ్రీశైలానికి విచ్చేసే ప్రతి భక్తుడికి మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు గారు, కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు గారు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ఉత్సవాల నిర్వహణలో భక్తుల అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ, వసతి, అన్నప్రసాద వితరణ, దర్శన సౌకర్యాల విషయంలో





భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడుతున్నారు.

**భక్తుల సౌకర్యాలపై చైర్మన్, ఈఓ ప్రత్యేక దృష్టి**

దసరా నవరాత్రి మహోత్సవాల సందర్భంగా శ్రీశైలానికి భక్తుల రాక పెరుగుతున్న నేపథ్యంలో వారికి అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు గారు, ఈఓ ఎం. శ్రీనివాసరావు గారు సమన్వయంతో కృషి చేస్తున్నారు. భక్తులకు వసతి కల్పించడం, అన్నప్రసాద వితరణ సజావుగా నిర్వహించడం, దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడటం వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తున్నారు.

-మిగతా 6 లో

### స్థానిక ఎన్నికలకు

## జిల్లా యంత్రాంగం సన్నద్ధం

- ఎన్నికల సంఘం ప్రకటనతో అధికారుల్లో కదలిక.. ఆరు మున్సిపాలిటీలు, 28 మండలాల్లో ఎన్నికల నిర్వహణకు కసరత్తు
- రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి.. ఎన్నికల అధికారులతో కలెక్టర్ సమీక్ష

**నంద్యాల బ్యూరో డ్రీమ్ టైమ్స్**

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతోంది. రాష్ట్ర ఎన్నికల సంఘం బుధవారం ఎన్నికలకు సంబంధించిన ప్రకటన విడుదల చేయడంతో జిల్లాలో ఎన్నికల సందడి మొదలైంది. మున్సిపాలిటీలు, జడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అధికారులు అప్రమత్తమయ్యారు. ఎన్నికల ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లపై దృష్టి సారించారు. ఎన్నికల సంఘం ప్రకటనతో అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో ఎన్నికల విధుల్లో నిమగ్నమైంది. జిల్లాలోని ఆరు మున్సిపాలిటీలు, 28 మండలాల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలతో పాటు 489 స్థానాల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు కసరత్తు జరుగుతోంది. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఇప్పటికే జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తికాగా, గ్రామ పంచాయతీల రిజర్వేషన్ల జాబితాను కలెక్టర్ గురువారం అధికారికంగా విడుదల చేశారు.

**ఎన్నికల అధికారులతో కలెక్టర్ సమీక్ష**




ఎన్నికల నిర్వహణకు సంబంధించి గురువారం సెంటినరీ హాలులో కలెక్టర్ ఎన్నికల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియలో అనుసరించాల్సిన విధానాలు, అధికారుల బాధ్యతలు, సిబ్బంది నియామకం, పోలింగ్ కేంద్రాల నిర్వహణ, ఎన్నికల నియమావళి అమలు తదితర అంశాలపై సమీక్షించినట్లు సమాచారం. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఎలాంటి లోపాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని యంత్రాంగం దృష్టి సారించింది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందికి నిబంధనలకు అనుగుణంగా శిక్షణ ఇప్పటికే పూర్తయింది. పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన సదుపాయాలు, ఎన్నికల సామగ్రి పంపిణీ, సిబ్బంది విధుల కేటాయింపు వంటి అంశాలపై

-మిగతా 6 లో

# భారత్‌ను వదిలి వెళ్లిపో

**నటుడు ఇమ్రాన్ ఖాన్‌కు ముంబై పోలీసుల నోటీస్**



**న్యూఢిల్లీ అక్టోబరు 15(డ్రీమ్ టైమ్స్):**
భారతదేశాన్ని వదిలి వెళ్లపోవాలంటూ నటుడు ఇమ్రాన్ ఖాన్‌కు ముంబై పోలీసులు నోటీస్ జారీ చేశారు. దీనికి ఈ నెల 28వ తేదీని డెడ్‌లైన్‌గా విధించారు. సీఈసీ రాజీనామా కోరుతూ అక్టోబర్ 10న ముంబైలోని క్రాంతిమైదానంలో జరిగిన నిరసనలో ఇమ్రాన్ పాల్గొన్నారు. నీట్ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా జూలై 22, 23 తేదీల్లో సీజేపీ జరిపిన ఆందోళనలో కూడా ఆయన పాల్గొన్నారు. ముంబైలో ఆందోళన తర్వాత అతడిని, గర్ల్‌ఫ్రెండ్, నటి లేఖా వాషింగ్టన్, కజిన్ జైన్ మేరీఖాన్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా, ఇమ్రాన్ ఖాన్ భారతీయుడు కాదని, భారత పౌరసత్వం లేకున్నా మన దేశంలో జరిగిన ఆందోళనలో పాల్గొని వీసా, వలస చట్టాలను అతిక్రమించాడని ముంబై పోలీసులు తెలిపారు.

# మహిళపైనా ‘గ్యాంగ్ రేప్’ కేసుపెట్టొచ్చు

**ఢిల్లీ హైకోర్టు చరిత్రాత్మక తీర్పు**




**న్యూఢిల్లీ అక్టోబరు 15(డ్రీమ్ టైమ్స్):**
ఒక మహిళ స్వయంగా లైంగిక చర్యకు పాల్పడకపోయినా బాధితురాలిపై జరిగిన అత్యాచారానికి సహకరించినప్పుడు క్రిమినల్ చట్టం ప్రకారం ఆమెపై సామూహిక లైంగిక దాడి కేసును నమోదు చేయవచ్చని ఢిల్లీ హైకోర్టు గురువారం ఒక చారిత్రాత్మక తీర్పును వెలువరించింది. గతంలో సామూహిక లైంగిక దాడికి సహకరించిన మహిళలు తీవ్రమైన ఆరోపణల నుంచి తప్పించుకోవడానికి వీలు కల్పించిన చట్టంలోని లొసుగును ఈ తీర్పు పరిష్కరించింది. ఒక మహిళ తన మైనర్ కుమార్తెను మరో నిందితుడితో లైంగిక సంబంధం కలిగి ఉండేలా బలవంతం చేసిందనే ఆరోపణలకు సంబంధించిన కేసులో ఈ తీర్పు వెలువడింది. ఈ నేరంలో భాగస్వామిగా ఉన్న తల్లిపై అభియోగాలు నమోదు చేయడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేస్తూ కోర్టు ఈ తీర్పును వెలువరించింది. ఒక మహిళపై ఐపీసీ సెక్షన్ 376డీ, బీఎన్ఎస్ సెక్షన్ 70 కింద సామూహిక లైంగిక దాడి నేరాన్ని మోపలేమని చెప్పడానికి ఎటువంటి ఆధారం లేదని ఈ కోర్టు భావిస్తున్నది. ప్రస్తుత తీర్పులో లేవనెత్తిన ప్రశ్నకు ఇదే సమాధానం అని హైకోర్టు పేర్కొంది.

# 11 మందికే అనుమతి



**న్యూఢిల్లీ అక్టోబరు 15(డ్రీమ్ టైమ్స్):**
ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామాను డిమాండ్ చేస్తూ ఈ నెల 16న నిర్వహించే ఆందోళనకు భారీగా పౌరులు తరలి రావాలని సీజేపీ పిలుపునిచ్చిన క్రమంలో అధికారులు అప్రమత్తం అయ్యారు. శుక్రవారం నాటి నిరసనకు పౌరులు తరలి రావద్దని ఢిల్లీ పోలీసులు గురువారం విజ్ఞప్తి చేశారు. ఆ రోజు కన్నాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్క్‌లో తగిన ప్రదేశంలో జాతీయ జెండాలను పట్టుకుని జాతీయగీతం పాడేందుకు 11 మంది బృందానికి తాము సౌకర్యాలు కల్పించగలమని, ఈ నిరసనలో ప్రజలు పాల్గొనవద్దని వారు కోరారు. కన్నాట్‌ప్లేస్, పరిసరాల్లో 163 సెక్షన్ కింద నిషేధాజ్ఞలు అమలులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ఆజ్ఞలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# స్టార్ లింక్ ఓ యుద్ధ సాధనం.. ఇరాన్ ప్రకటన



**న్యూఢిల్లీ అక్టోబరు 15(డ్రీమ్ టైమ్స్):**
ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ కంపెనీ స్టార్‌లింక్ ఇంటర్నెట్ సేవలపై కఠిన చర్యలు తీసుకొంటూనే ఉంటామని ఇరాన్ ప్రకటించింది. దాన్ని తమ దేశ శత్రువుల చేతిలో ఒక యుద్ధ ఆయుధంగా ఇరాన్ సీనియర్ సైబర్ అధికారి ఒకరు అభివర్ణించారు. అమెరికా, ఇజ్రాయెల్‌తో తమ దేశానికి ఘర్షణ కొనసాగుతున్న నేపథ్యంలో స్టార్‌లింక్ ఇంటర్నెట్‌పై కఠిన పరిమితులు విధిస్తామని తెలిపారు.

# వాయు కాలుష్య నివారణలో అట్టడుగున భారత్



**న్యూఢిల్లీ అక్టోబరు 15(డ్రీమ్ టైమ్స్):**
ప్రపంచ వాతావరణ, ఆరోగ్య కూటమి(జీసీహెచ్ఏ) తాజాగా విడుదల చేసిన ఆరోగ్యకరమైన జాతీయ నిర్ణీత సహకారం(ఎన్‌డీసీ) స్కోర్‌బోర్డ్ ప్రకారం భారత్ తన జాతీయ వాతావరణ ప్రణాళికలో ఆరోగ్యాన్ని పరిగణనలోకి తీసుకోవడంలో విఫలమైంది. ఈ సంవత్సరానికి సంబంధించిన మదింపులో భారత్ 32కు గాను కేవలం 2 పాయింట్లు మాత్రమే సాధించి అట్టడుగు స్థానంలో నిలిచింది. ఈ నివేదిక ప్రకారం భారత్ ఉద్గారాల లక్ష్యాలు పారిస్ ఒప్పందానికి అనుగుణంగా లేవు. అవి మానవ ఆరోగ్యానికి ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. భారత్‌పై వాయు కాలుష్యం కారణంగా సంభవించే మరణాల భారం చాలా ఎక్కువగా ఉంది. అయినా భారత్ ఈ విషయాన్ని తన ఎన్‌డీసీ ప్రణాళికలో పేర్కొనలేదు.

# ఇద్దరు బంగ్లాదేశీయులకు సౌదీలో మరణశిక్ష



**రియాద్ అక్టోబరు 15(డ్రీమ్ టైమ్స్):**
ఇద్దరు బంగ్లాదేశీయులకు సౌదీలో మరణశిక్ష విధించడం సంచలనంగా మారింది. సౌదీ అంతర్గత వ్యవహారాల శాఖ తెలిపిన వివరాల ప్రకారం.. పవిత్ర నగరమైన మక్కాలోని ఓ మసీదులో ఇద్దరు బంగ్లాదేశీ పౌరులు నజెరుల్ ఇస్లాం అబ్దుల్ బాసిర్, సితి అక్తర్ అనైతిక కార్యకలాపాలకు పాల్పడ్డారు. దీంతో ఇద్దరినీ భద్రతా దళాలు అదుపులోకి తీసుకున్నాయి. విచారణలో వీరిద్దరూ దోషులుగా తేలడంతో ఇస్లామిక్ చట్టం ప్రకారం మరణశిక్ష విధించారు. అయితే ఆ ఇద్దరు ఎలాంటి అనైతిక చర్యలకు పాల్పడ్డారో మాత్రం వివరించలేదు.

# అమెరికా వర్సిటీలో మహిళపై లైంగిక దాడి

**బయట నిలబడి పురుషుల కేరింతలు**




**న్యూఢిల్లీ: అక్టోబరు 15(డ్రీమ్ టైమ్స్):**
అమెరికాలోని ఒక యూనివర్సిటీలో అత్యంత దారుణ ఘటన చోటుచేసుకుంది. ఆదివారం ఓ 21 ఏండ్ల యువతిపై లైంగిక దాడి జరిగింది. న్యూయార్క్ పోస్ట్ కథనం ప్రకారం ఈ ఘటనలో పలువురు నిందితులు ఉన్నారు. బాధితురాలిపై బాత్‌రూమ్‌లో లైంగిక దాడి జరుగుతున్న సమయంలో మిగిలిన నిందితులు బయట ఉండి కేరింతలు కొడుతూ తమ వంతు కోసం వేచి ఉండటం అత్యంత దిగ్భ్రాంతికరంగా మారింది. షికాగో విశ్వవిద్యాలయం సమీపంలోని ఒక ఫ్రెటర్నిటీ పార్టీలో ఒక మహిళకు సంబంధించిన కేసును షికాగో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని స్థానిక మీడియా పేర్కొంది. మీడియా కథనం ప్రకారం బాత్‌రూమ్ బయట గుమికూడిన పలువురు పురుషులు కేరింతలు కొడుతూ, అసభ్యకరమైన వ్యాఖ్యలు చేస్తుండగా ఆ మహిళ లైంగిక దాడికి గురైంది. ఆ మహిళ విశ్వవిద్యాలయంలో చదువుకుంటున్న విద్యార్థిని కాదని పోలీసులు ధృవీకరించారు.

# 30 అడుగుల బొద్దింక దిష్టిబొమ్మ దహనం



**న్యూఢిల్లీ అక్టోబరు 15(డ్రీమ్ టైమ్స్):**
సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ దేశ వ్యాప్తంగా సీజేపీ ఆందోళనలు నిర్వహిస్తున్న సమయంలో కీలక పరిణామం చోటుచేసుకున్నది. ఢిల్లీలో ప్రతి ఏటా రామ్‌లీలా కార్యక్రమంలో రావణాసురుడు,కుంభకర్ణుడు, మేఘనాథుడి దిష్టిబొమ్మలు దహనం చేస్తుంటారు. అయితే ఈ ఏడాది ఈ ముగ్గురి దిష్టిబొమ్మలతో పాటు 30 అడుగుల బొద్దింక దిష్టిబొమ్మను కూడా దహనం చేయనున్నారు. పితాంపురలో రామ్‌లీలా కార్యక్రమాన్ని నిర్వహించే శ్రీ కేశవ్ రామ్‌లీలా కమిటీ ఈ నిర్ణయం తీసుకున్నది.

# రోడ్లపై, బహిరంగ ప్రదేశాలలో టపాసులు కాల్చడంపై మహారాష్ట్రలో నిషేధం..

**న్యూఢిల్లీ అక్టోబరు 15(డ్రీమ్ టైమ్స్):**
దీపావళి పండుగ రాబోతున్న వేళ టపాసులు కాల్చడంపై మహారాష్ట్రకు చెందిన బాంబే హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. రోడ్ల మీద, బహిరంగ ప్రదేశాలలో, ప్రజలు ఎక్కువగా ఉండే ప్రదేశాలలో టపాసులు కాల్చడాన్ని నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. మహారాష్ట్రవ్యాప్తంగా ఈ నిర్ణయం అమలవుతుందని తెలిపింది. ఈ అంశంపై గురువారం ఆదేశాలు జారీ చేసింది. దీపావళి, ఇతర పండుగల సందర్భంగా టపాసులు కాల్చడం వల్ల జరుగుతున్న వాయు కాలుష్యం, శబ్ద కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకుని కోర్టు తాజా ఆదేశాలు జారీచేసింది. జస్టిస్ గిరీష్ కులకర్ణి, జస్టిస్ నీలా గోఖలే ఆధ్వర్యంలోని బెంచ్ ఈ ఆదేశాలు ఇచ్చింది. ఇదే సమయంలో డీజేల వినియోగం, లౌడ్ స్పీకర్లు, డాల్బీ సౌండ్ సిస్టమ్స్, లేజర్ లైట్లపై కూడా స్పందించింది. వీటి వాడకం విషయంలో తగిన నిబంధనలు, మార్గదర్శకాలు రూపొందించాలని ప్రభుత్వానికి సూచనలు చేసింది. ఈ అంశంలో వారంలోగా స్పందించి, కఠిన చర్యలు అమలులోకి తేవాలని సూచించింది. పండుగల సందర్భంగా టపాసులు, సౌండ్ సిస్టమ్స్ వంటి వాటివల్ల తలెత్తుతున్న ఇబ్బందులపై దాఖలపై ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై విచారణ సందర్భంగా కోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. అయితే, ఏ తరహా టపాసులు విక్రయించాలి.. వాటి తయారీలో




నిబంధనలు వంటి వాటిపై స్పందించేందుకు కోర్టు నిరాకరించింది. గత నెలలో జరిగిన గణేష్ ఉత్సవాల సందర్భంగా కూడా కీలక ఆదేశాలు జారీ చేసింది. వినాయక ఉత్సవాల సందర్భంగా టపాసులు కాల్చవద్దని సూచించింది. తాజాగా స్పందించిన కోర్టు.. టపాసుల వల్ల వెలువడే విష వాయువులతో వృద్ధులు, పిల్లలు, రోగులు ఇబ్బంది పడతారని కోర్టు వ్యాఖ్యానించింది. కాలం మారుతోందని.. ఇప్పుడు ఈ విషయంలో మారాల్సిన తరుణం వచ్చిందని కోర్టు అభిప్రాయపడింది. ఇదే సమయంలో టపాసుల తయారీ, విక్రయాల వల్ల ఎందరికో ఉపాధి దొరుకుతుందన్న విషయాన్ని కూడా కోర్టు పరిగణనలోకి తీసుకుంది. టపాసులు కాల్చే విషయంలో ప్రజలకు అవగాహన కల్పించాలని, గ్రీన్ లేదా ఎకో ఫ్రెండ్లీ టపాసులు కాల్చేలా ప్రోత్సహించాలని అధికారులకు సూచించింది.

# బీఎస్‌ఎఫ్ క్యాంప్‌లో ఫుడ్ పాయిజనింగ్..

**- 75 మంది సిబ్బంది ఆస్పత్రిపాలు**

**అక్టోబరు 15(డ్రీమ్ టైమ్స్):**
మణిపూర్, ఇంఫాల్‌లోని బీఎస్ఎఫ్ (బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్) క్యాంపులో ఫుడ్ పాయిజనింగ్ జరిగింది. ఈ ఘటనలో దాదాపు 75 మంది బీఎస్ఎఫ్ జవాన్లు అస్వస్థతకు గురయ్యారు. వీరితోపాటు మరో ముగ్గురు పౌరులు కూడా అస్వస్థతకు గురయ్యారు. ప్రస్తుతం వీరందరినీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స అందుతోంది. ఈ ఘటన గురువారం ఉదయం జరిగింది. ఉదయం బీఎస్ఎఫ్ జవాన్లు, ఇతర సిబ్బంది బ్రేక్‌ఫాస్ట్ చేశారు. ఆ తర్వాత కొద్ది సేపటికి ఆహారం తిన్న 78 మంది అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, కడుపునొప్పి వంటి లక్షణాలు మొదలయ్యాయి. దీంతో



వెంటనే వారిని అత్యవసర ప్రాతిపదికన స్థానిక రీజనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్)కు తరలించారు. 78 మంది చికిత్స పొందుతుండగా.. వారి పరిస్తితి ప్రస్తుతం స్తిరంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ప్రాణాపాయం ఏమీ లేదన్నారు. అయితే, ఈ ఫుడ్ పాయిజనింగ్‌కు కారణం ఏంటనేది ఇంకా తెలియరాలేదు. అందరూ ఒకే ఆహారం తీసుకున్నారా.. వేర్వేరు పదార్థాలా అనేది కూడా తేలాలి. దీనిపై ఉన్నతాధికారులు విచారణ జరుపుతున్నారు. సంబంధిత ఆహార పదార్థాల్ని అధికారులు సేకరించారు. వాటి పరిశీలన అనంతరం ఈ ఘటనకు గల కారణాలు తెలియరావచ్చు.

# పది నెలల్లో మోదీ పభుత్వం కూలిపోతుంది!

- కార్యకర్తలకు రాహుల్ గాంధీ భరోసా
- భయపడొద్దు.. అండగా ఉంటా
- కేంద్రానికి వ్యతిరేకంగా యువత
- బీజేపీలో చేరిన నేతలపై వ్యంగ్యాస్త్రాలు
- ఎన్ఎస్‌యూఐ, సేవాదళ్, యూత్ కాంగ్రెస్ శ్రేణులతో టీ పార్టీ
- నిరసనల అనంతరం కార్యకర్తలతో రాహుల్ భేటీ



న్యూఢిల్లీ:
మరో పది నెలల్లో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కూలిపోతుందని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. గురువారం ఎన్ఎస్‌యూఐ, సేవాదళ్, యూత్ కాంగ్రెస్ కార్యకర్తలతో ఆయన టీ పార్టీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా భయపడాల్సిన అవసరం లేదని, తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. దేశ యువత కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిలుస్తున్నారని రాహుల్ గాంధీ అన్నారు. కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరిన నాయకులు సైతం ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను చూసి బాధపడుతున్నారని వ్యాఖ్యానించారు. ఈ మేరకు వారిపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కార్యకర్తల్లో ధైర్యం నింపుతూ, కేంద్ర ప్రభుత్వంపై తన రాజకీయ విమర్శలను కొనసాగించారు.

# ఉగ్రదాడులకు ఇక ఉక్కుపాదమే!



న్యూఢిల్లీ:
పాకిస్తాన్ నుంచి భారత్‌పై మరోసారి ఉగ్రదాడి జరిగితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరించారు. సరిహద్దు ఉగ్రవాదాన్ని అణచివేసే విషయంలో భారత్ ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోదని స్పష్టం చేశారు. శాంతి, చర్చలకు భారత్ కట్టుబడి ఉన్నంత మాత్రాన దాన్ని బలహీనతగా భావించవద్దని పాకిస్తాన్‌కు తేల్చిచెప్పారు. న్యూఢిల్లీలో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన దేశ భద్రత, ఉగ్రవాదంపై భారత్ అనుసరిస్తున్న వ్యూహంపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే విషయంలో భారత్ వైఖరిలో నిర్ణయాత్మక మార్పు వచ్చిందని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. గతంలో దాడులను ఖండించడంతో సరిపెట్టుకునే పరిస్థితి నుంచి, ఉగ్రవాదానికి దీటుగా బదులిచ్చే దిశగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. దేశానికి ఎదురవుతున్న ముప్పును మూలాల నుంచే తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆపరేషన్ సిందూర్, బాలాకోట్ వైమానిక దాడులు, సర్జికల్ స్ట్రైక్స్ ఇందుకు ఉదాహరణలని పేర్కొన్నారు. ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని రక్షణ మంత్రి అన్నారు. దేశంలో శాంతి నెలకొనాలంటే సైనికంగా బలోపేతం కావడంతోపాటు, ఎలాంటి ముప్పునైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. దేశ భద్రత విషయంలో అప్రమత్తత, సంసిద్ధత అత్యంత కీలకమని పేర్కొన్నారు. సంప్రదాయ యుద్ధ ముప్పులతో పాటు డిజిటల్ సాంకేతికత ద్వారా ఎదురవుతున్న సవాళ్లపైనా రాజ్‌నాథ్ సింగ్ ఆందోళన వ్యక్తం చేశారు. తప్పుడు సమాచారం వ్యాప్తి, అస్థిరత సృష్టించడం, అంతరాయాలు కలిగించడం, మోసం, విధ్వంసం వంటి ఐదు రకాల ముప్పులు దేశ భద్రతకు సవాలుగా మారుతున్నాయని వివరించారు.

# సింగరేణిని ప్రైవేటీకరించే ప్రసక్తే లేదు

మొదటి తరువాయి

అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, సంస్థకు భారీగా బకాయిలు మిగిల్చి ఆర్థికంగా నష్టపరిచారని విమర్శించారు. గతంలో సంస్థను నిర్వీర్యం చేశారని ఆరోపించిన నాయకులు ఇప్పుడు కార్మికుల సంక్షేమం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. సింగరేణి సంస్థ ప్రతిష్ఠను దెబ్బతీసే లక్ష్యంతోనే బీఆర్ఎస్ నేతలు ప్రైవేటీకరణపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని మంత్రి మండిపడ్డారు. ఎలాంటి ఆధారాలు లేని విమర్శలను కార్మికులు, ప్రజలు పట్టించుకోవద్దని సూచించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే సింగరేణి ప్రయోజనాలను కాపాడిందని, ప్రస్తుతం కూడా సంస్థను పరిరక్షించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను పూర్తి స్థాయిలో నడిపిస్తామని శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు. వాస్తవాలు తెలుసుకోకుండా, ఆధారాలు లేకుండా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. సింగరేణి ప్రైవేటీకరణపై వస్తున్న ఆరోపణలకు ఆందోళన చెందకుండా, సంస్థ ప్రయోజనాలు మరియు కార్మికుల సంక్షేమంపై ప్రభుత్వం తీసుకునే చర్యలపై విశ్వాసం ఉంచాలని ఆయన సూచించారు.

# మతం మారితే రిజర్వేషన్లు కట్

సుప్రీంకోర్టు స్పష్టీకరణ




, నేషనల్ బ్యూరో:
హిందూ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు మతం మారితే బీసీ రిజర్వేషన్ల ప్రయోజనాలు వర్తించవని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. హిందూ సామాజిక వర్గంలో ఉన్న సామాజిక వెనుకబాటుతనం అనేది ఆ వ్యక్తి మతం మారిన తర్వాత ఇతర సామాజిక వర్గాలకు బదిలీ కాదని ప్రశాంత్ కుమార్ మిశ్రా, చంద్రశేఖర్‌లతో కూడిన ధర్మాసనం తేల్చి చెప్పింది. హిందూ మతం నుంచి ఇస్లాం మతంలోకి మారిన వారికి ప్రత్యేకంగా 'బీసీ ముస్లిం' కేటగిరీ కింద రిజర్వేషన్లు కల్పిస్తూ 2024లో తమిళనాడు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను మద్రాస్ హైకోర్టు తప్పుపట్టింది. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే.. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం మద్రాస్ హైకోర్టు తీర్పును సమర్థించింది.

## హిందువులపై సామూహిక కాల్పులకు కుట్ర

షికాగో, అక్టోబర్ 15
భారతదేశంపై ద్వేషంతో ఇల్లినాయిస్ స్టేట్ షికాగో నగర పరిధిలోని అరోరా ప్రాంతంలో హిందూ ప్రార్థనా మందిరంపై సామూహిక కాల్పులు జరపడానికి కుట్రపన్నిన 19 ఏండ్ల టీనేజర్‌ను యూఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. హిందూ ప్రార్థనా స్థలాన్ని లక్ష్యంగా చేసుకుని సామూహిక కాల్పులు జరపాలని, హిందువులను భారీగా చంపాలని కుట్రపన్నిన అలెగ్జాండ్రోస్ పాపరాకీస్ అనే యువకుడిని అరెస్ట్ చేసినట్టు అధికారులు తెలిపారు. అతడు భారతీయులపై విద్వేషం వ్యక్తం చేస్తూ సామాజిక మాధ్యమంలో పలు పోస్ట్‌లు పెట్టినట్టు గమనించారు. శ్వేతజాతి ఆధిపత్య భావజాలాన్ని వ్యక్తం చేస్తూ భారత సంతతి ప్రజలపై హింసను ప్రస్తావించే పత్రాన్ని అతని నుంచి స్వాధీనం చేసుకున్నామన్నారు. కాగా, యూఎస్‌లోని ప్రార్థనా మందిరం వద్ద సామూహిక కాల్పులకు జరిగిన కుట్రపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.

# భారత్‌కు నేపాల్ ప్రధాని

- ప్రధానిగా బాధ్యతలు చేపట్టాక తొలి విదేశీ పర్యటన
- మూడు రోజుల పర్యటనకు సిద్ధమవుతున్న నేపాల్ ప్రధాని
- ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చలు
- భారత సీనియర్ మంత్రులతోనూ సమావేశాలు
- మౌలిక వసతులు, జలవిద్యుత్ ప్రాజెక్టులపై చర్చ
- సరిహద్దు సమస్యలపైనా చర్చించే అవకాశం
- వరదల సమయంలో భారత్ అందించిన సాయానికి కృతజ్ఞతలు
- ఇరు దేశాల సంబంధాల బలోపేతంపై దృష్టి




నేషనల్ బ్యూరో:
నేపాల్ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన బాలేంద్ర షా నవంబర్‌లో భారత్‌లో పర్యటించనున్నారు. ప్రధానిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయనకు ఇదే తొలి అధికారిక విదేశీ పర్యటన కానుంది. మార్చిలో బాధ్యతలు చేపట్టిన ఆయన, మూడు రోజుల పర్యటనలో భాగంగా భారత ప్రధాని నరేంద్ర మోదీతో పాటు పలువురు సీనియర్ మంత్రులతో సమావేశమై ద్వైపాక్షిక అంశాలపై చర్చించనున్నారు. గతంలో నేపాల్ ప్రధానులుగా బాధ్యతలు చేపట్టిన పలువురు నేతలు తమ తొలి విదేశీ పర్యటనకు చైనాను ఎంచుకోగా, బాలేంద్ర షా భారత్‌కు రావాలని నిర్ణయించుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ పర్యటనలో ఇరు దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడం, పరస్పర సహకారాన్ని విస్తరించడం వంటి అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది. మౌలిక వసతుల అభివృద్ధి, జలవిద్యుత్ ప్రాజెక్టులు, సరిహద్దు సమస్యలు ప్రధాన చర్చనీయాంశాలుగా ఉండనున్నాయి. ఇరు దేశాలకు ప్రయోజనం చేకూర్చే అభివృద్ధి కార్యక్రమాలు, ప్రాంతీయ సహకారంపై కూడా చర్చలు జరిగే అవకాశం ఉంది. ఇటీవల ఆగస్టులో భోటెకోషి ప్రాంతంలో సంభవించిన వరదల అనంతరం భారత్ నేపాల్‌కు 130 టన్నులకు పైగా సహాయ సామగ్రిని పంపించింది. సహాయక చర్యల కోసం రెస్క్యూ సిబ్బందిని కూడా అందించింది. ఈ సహాయానికి నేపాల్ ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు. బాలేంద్ర షా పర్యటనతో భారత్--నేపాల్ సంబంధాల్లో కీలక అంశాలపై చర్చలకు అవకాశం ఏర్పడనుంది.

# మహిళలు ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదగాలి!

- విజయవాడలో జాతీయ సరస్ మేళా--2026 ప్రారంభం
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలిసి ప్రారంభించిన చంద్రబాబు
- గ్రామీణ ఉత్పత్తులకు 'స్వయం ఏపీ' బ్రాండ్
- డ్వాక్రా సంఘాల వార్షిక టర్నోవర్ రూ.69 వేల కోట్లు
- 650 స్వయం సహాయక సంఘాలతో జాతీయ స్థాయి ప్రదర్శన
- ఈ-కామర్స్‌తో ప్రపంచ మార్కెట్‌కు మహిళల ఉత్పత్తులు
- ప్రతి గ్రామం ఉపాధి కేంద్రంగా మారాలన్న సీఎం



విజయవాడ,
మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా పరిమితం చేయకుండా, ఆర్థికంగా స్వావలంబులుగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. మహిళలు ఉద్యోగాలు అడిగే స్థాయి నుంచి ఇతరులకు ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని, సంపద సృష్టికర్తలుగా మారాలని ఆకాంక్షించారు. ఈ దిశగా గ్రామీణ మహిళల నైపుణ్యాలు, ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో గుర్తింపు కల్పించే జాతీయ సరస్ మేళా--2026ను విజయవాడలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలిసి గురువారం ప్రారంభించారు. గ్రామీణ మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో గుర్తింపు తీసుకువచ్చేందుకు 'స్వయం ఏపీ' బ్రాండ్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు చంద్రబాబు తెలిపారు. దసరా శరన్నవరాత్రుల వేళ ఇంద్రకీలాద్రి సాక్షిగా ఈ మేళా నిర్వహించడం నగరానికి ప్రత్యేక శోభను తెచ్చిందన్నారు. మారుమూల గిరిజన ప్రాంతంలో జన్మించి ఎన్నో సవాళ్లను అధిగమించి దేశ అత్యున్నత పదవిని అలంకరించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీవితం ప్రతి మహిళకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. రాష్ట్రంలో 1.10 కోట్ల మంది సభ్యులతో 11 లక్షల స్వయం సహాయక సంఘాలు ఉన్నాయని, ఇవి ఏటా రూ.69 వేల కోట్ల టర్నోవర్ సాధిస్తున్నాయని ముఖ్యమంత్రి వివరించారు. ఒకప్పుడు పొదుపు సంఘాలుగా ఉన్నవి ఇప్పుడు వ్యాపార సంస్థలుగా ఎదుగుతున్నాయని, భవిష్యత్తులో అంతర్జాతీయ బ్రాండ్లుగా రూపుదిద్దుకోవాలని ఆకాంక్షించారు. ఈ మేళాలో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 650 స్వయం సహాయక సంఘాలు పాల్గొంటున్నాయని తెలిపారు. ఇది కేవలం ఉత్పత్తుల ప్రదర్శన మాత్రమే కాదని, గ్రామీణ ఉత్పత్తులకు ఏడాది పొడవునా మార్కెటింగ్ అవకాశాలు కల్పించే ప్రయత్నమని పేర్కొన్నారు. 'స్వయం ఏపీ' ఉత్పత్తులను ఈ-కామర్స్, ఆన్‌లైన్ షాపింగ్ వేదికల ద్వారా ప్రపంచ మార్కెట్‌కు పరిచయం చేస్తామని చంద్రబాబు వెల్లడించారు. వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలను వ్యాపార అభివృద్ధికి వినియోగించుకోవాలని మహిళలకు సూచించారు. మహిళల సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకున్నప్పుడే 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని సాధించగలమన్నారు. వారి భద్రత, ఆత్మగౌరవానికి ప్రాధాన్యమిస్తూనే ఆర్థిక ఎదుగుదలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రతి స్వయం సహాయక సంఘం ఆర్థిక శక్తిగా, ప్రతి మహిళ పారిశ్రామికవేత్తగా, ప్రతి గ్రామం ఉపాధి కేంద్రంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, పెమ్మసాని చంద్రశేఖర్, రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, వంగలపూడి అనిత తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక పోరులోనూ టీడీపీ--జనసేన జోడీ!

ఏ పార్టీ ఎక్కడ పోటీ చేస్తుందనే వివరాలతో పాటు ఉమ్మడి అభ్యర్థుల జాబితాను మరో రెండు రోజుల్లో విడుదల చేస్తామని చెప్పారు. ఇరు పార్టీల కార్యకర్తల మనోభావాలు దెబ్బతినకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. 2024 ఎన్నికల్లో ప్రజలు కూటమిపై విశ్వాసం ఉంచి తీర్పు ఇచ్చారని, దానిని గౌరవిస్తూ ముందుకు సాగుతామని పేర్కొన్నారు. కూటమిలో విభేదాలు ఉన్నాయంటూ జరుగుతున్న ప్రచారానికి తమ నిర్ణయంతో తెరపడుతుందని అన్నారు. జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆలోచనలకు అనుగుణంగానే సీట్ల సర్దుబాటు జరిగిందని వివరించారు. వచ్చే 2029 ఎన్నికల్లోనూ టీడీపీ--జనసేన పొత్తు కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# జగన్ కాక్రోచ్ జపం!



అమరావతి
'నేనూ కాక్రోచ్‌నే' అని ఆ మధ్య ఒక ప్రకటన చేసిన వైసీపీ అధినేత ఇప్పుడు నేరుగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)కి మద్దతు పలికారు. "సీజేపీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకా అరెస్టులు సమస్యలను పరిష్కరించలేవు. ఎన్నికల ప్రక్రియపై విశ్వాసాన్ని పునరుద్ధరించాలి. ప్రభుత్వ వ్యతిరేక ధోరణితో పరిస్థితులు ఉద్రిక్తమవుతాయి. ప్రభుత్వ విధానాల్లోని లోపాలను సవరించుకోవాలి" అని గురువారం 'ఎక్స్'లో జగన్ పేర్కొన్నారు. ఆయన మద్దతుకు సీజేపీ నేతలు ధన్యవాదాలు తెలిపారు. దీంతో ఈ పరిణామం రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. అవినీతి, అక్రమాస్తుల కేసుల్లో నిండా మునిగిన జగన్.... ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వాన్ని ఎప్పుడూ విమర్శించలేదు. ఆయన అధికారంలో ఉండగా... కేంద్రం అడగకపోయినా అన్ని విషయాల్లో మద్దతు పలికారు. అలాంటి జగన్ ఇప్పుడు హఠాత్తుగా సీజేపీకి మద్దతు పలుకుతూ కేంద్ర ప్రభుత్వానికి సుద్దులు చెప్పడం గమనార్హం. తమ అధినేత ట్వీట్ చేయగానే వైసీపీ శ్రేణులు సామాజిక మాధ్యమాల్లో క్రియాశీలమయ్యాయి. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీతో కలసి ప్రయాణం చేయాలని జగన్‌కు సూచించాయి. గతంలో తానూ కాక్రోచ్‌నేనంటూ మీడియా ముందు జగన్ మాట్లాడిన సందర్భంలో విలేకరులు రాహుల్ ప్రస్తావన తీసుకురాగా.. ఆయన గురించి మాట్లాడడం టైమ్ వేస్ట్ అని జగన్ తేలిగ్గా తీసిపడేశారు.

# మాంసం తినే మహిళలు వందేండ్లు బతికే చాన్స్

- వందేళ్లు జీవించే అవకాశంపై చైనా అధ్యయనంలో ఆసక్తికర అంశాలు
- శాకాహారులతో పోలిస్తే 44 శాతం అధిక అవకాశమని వెల్లడి
- 80 ఏళ్లు దాటిన ఐదు వేల మంది మహిళలపై పరిశోధన
- బరువు తక్కువగా ఉన్న మహిళల్లోనే ఈ వ్యత్యాసం
- బరువు ఎక్కువగా ఉన్నవారిలో కనిపించని తేడా
- అమెరికన్ జర్నల్ ఆఫ్ క్లినికల్ న్యూట్రిషన్‌లో ప్రచురణ



బీజింగ్
మాంసాహారం తినే మహిళలు వందేళ్లు జీవించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చైనాలో నిర్వహించిన ఓ అధ్యయనం వెల్లడించింది. ముఖ్యంగా బరువు తక్కువగా ఉన్న మాంసాహార మహిళలు, శాకాహారం తీసుకునే మహిళలతో పోలిస్తే వందేళ్లు జీవించే అవకాశం 44 శాతం అధికంగా ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. అయితే, ఈ ఫలితాలు అన్ని మహిళలకూ వర్తిస్తాయని భావించకూడదని, అధ్యయనంలో గుర్తించిన పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. చైనీస్ లాంగిట్యూడినల్ హెల్తీ లాంగివిటీ సర్వేలో భాగంగా 80 ఏళ్లు దాటిన సుమారు ఐదు వేల మంది మహిళల ఆరోగ్య వివరాలను పరిశీలించారు. వారి ఆహారపు అలవాట్లు, శరీర బరువు, దీర్ఘాయుష్షు మధ్య ఉన్న సంబంధాన్ని అధ్యయనం చేశారు. ఈ పరిశోధన ఫలితాలు అమెరికన్ జర్నల్ ఆఫ్ క్లినికల్ న్యూట్రిషన్‌లో ప్రచురితమయ్యాయి. అధ్యయనం ప్రకారం, బరువు తక్కువగా ఉన్న మహిళల్లో మాంసాహారం తీసుకునేవారు వందేళ్ల వరకు జీవించే అవకాశంలో శాకాహారులతో పోలిస్తే ఎక్కువగా ఉన్నారు. అయితే, అధిక బరువు ఉన్న మహిళల్లో శాకాహారం, మాంసాహారం తీసుకునేవారి మధ్య ఇలాంటి వ్యత్యాసం కనిపించలేదు. గతంలో శాకాహారం తీసుకునేవారే ఎక్కువ కాలం జీవిస్తారనే అభిప్రాయాలు కొన్ని అధ్యయనాల్లో వ్యక్తమయ్యాయి. తాజా పరిశోధన మాత్రం ఆహారపు అలవాట్లతో పాటు శరీర బరువు, వయసు, మొత్తం ఆరోగ్య పరిస్థితి వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరాన్ని సూచిస్తోంది. ఈ ఒక్క అధ్యయనం ఆధారంగా మాంసాహారమే దీర్ఘాయుష్షుకు కారణమని నిర్ధారించలేం.

# సంపాదకీయం

## ఇది ఇంతటితో ఆగేలా లేదు



'గోటితో పోయేదాన్ని గొడ్డలి దాకా తెచ్చుకోవడం' అనే పచ్చి సామెతను తలపిస్తోంది దేశంలో ప్రస్తుత పరిస్థితి. 'సర్' ప్రక్రియపై మొదట్నుంచి అనుమానాలున్నాయి. బీహార్, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీల ఎన్నికల సందర్భంగా విపక్షాలనుంచి ఎన్నో విమర్శలు, నిర్దిష్ట ఆరోపణలు వచ్చినప్పటికీ ఎన్నికల కమిషన్ చర్యల్ని తప్పుబట్టగల ఆధారాలు అప్పట్లో లేవు. ఇప్పుడిప్పుడే ఒకటొకటిగా అన్నీ బయటకు వస్తున్నాయి. ఇసిలో ఏకాభిప్రాయం లేదని, సిఇసి జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష నిర్ణయాలే ఏడాది కాలంగా అమలవుతున్నాయన్న మీడియా పరిశోధనాత్మక కథనం తర్వాత నిరసన దేశవ్యాప్తంగా పెల్లుబికింది. రాజకీయ పార్టీలకు అతీతంగా విద్యార్థులు, యువతరం, మేధావివర్గం, ప్రజాస్వామ్యవాదులు.. ఇలా విభిన్న వర్గాల వారు ఏకకంఠంతో గొంతెత్తారు. ముంబై, కోల్‌కతా, హైదరాబాద్.. ఇలా పెద్ద నగరాలకూ నిరసన వేడి విస్తరించింది. సిఇసి దిగిపోవాలని, 'సర్' రద్దు చేయాలని, చట్టవ్యతిరేక 'సర్' అమలుతో జరిగిన తప్పుడు ఎన్నికల్ని సమీక్షించాలన్న డిమాండ్‌ను నిరసనకారులు తెరపైకి తెచ్చారు. ప్రజాందోళన రోజురోజుకు బలపడుతూ వచ్చింది. ఢిల్లీలో నిరసన అణచివేత చర్యల్ని సుప్రీం కోర్టు తప్పుపట్టింది. పోలీసులకు పట్టినట్టు లేదు. కోర్టు చెప్పినా నిర్బంధ ఒరవడి ఇంకా కొనసాగుతూనే ఉంది. రద్దు చెల్లుబాటయ్యేనా? దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసనలు జరపడాన్ని పూర్తిగా నిషేధిస్తూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఇచ్చిన ఉత్తర్వులు చెల్లుబాటవుతాయా? న్యాయ సమీక్షకు అవి నిలుస్తాయా? అన్నది ఇప్పుడు ప్రశ్న. రద్దు నిర్ణయాన్ని ఖాతరు చేయకుండా ఆ ప్రదేశంలో చేరి, నిరసన తెలపడానికి యత్నించిన సిజెపి కార్యకర్తలు, ఇతర నిరసనకారుల్ని పోలీసులు మంగళవారం అడ్డుకున్నారు. వారిని నిర్బంధంలోకి తీసుకున్నారు. శాంతియుతంగా నిరసన తెలపడం పౌరుల ప్రజాస్వామిక హక్కు అని, వారిని నిర్బంధించకూడదని సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలను కూడా పోలీసులు లెక్కచేయలేదు. 'జంతర్ మంతర్ వద్ద నిరసనల్ని నిషేధించాం కనుక అడ్డుకున్నాం' అన్నది పోలీసుల ధీమా కావచ్చు. కానీ, అలా ఏకపక్షంగా నిరసనల్ని పూర్తిగా నిషేధించి, నిరసన స్థలాన్ని ఉన్న పళంగా మార్చడం సరికాదని తెలంగాణ హైకోర్టు ధర్మాసనం లోగడ తీర్పు చెప్పింది. హైదరాబాద్ నగరం నడిబొడ్డున, ఇందిరా పార్కు సమీపంలోని 'ధర్నా చౌక్'ను ఎత్తివేసి, నగర శివార్లకు బదలాయించిన రాష్ట్ర ప్రభుత్వ చర్యని హైకోర్టు 2018 నవంబర్‌లో తప్పుబట్టింది. రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిన 'ధర్నా చౌక్'ని కోర్టు పునరుద్ధరించింది. ప్రొఫెసర్ పి.ఎల్.విశ్వేశ్వర్ రావు, వి.హన్మంతరావు (కాంగ్రెస్), చాడ వెంకటరెడ్డి (సిపిఐ) తదితరుల ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని (పిఐఎల్) సుమోటోగా స్వీకరించిన హైకోర్టు, ప్రభుత్వ చర్యల్ని తప్పుబట్టింది. ధర్నా చౌక్ పునరుద్ధరణకు ముందు, తర్వాత కూడా పలుమార్లు న్యాయస్థానం కల్పించుకొని, పౌరుల నిరసనలకు ప్రత్యేకంగా అనుమతులు ఇప్పించింది. ట్రాఫిక్ అంతరాయాలు, స్థానికుల అసౌకర్యాలను పోలీసులు తమ నిర్ణయానికి కారణంగా చూపినప్పటికీ కోర్టు అంగీకరించలేదు. తమ అసంతృప్తిని వ్యక్తపరచడానికి, అందుకు శాంతియుతంగా గుమిగూడడానికి పౌరులు రాజ్యాంగబద్ధమైన హక్కును కలిగి ఉన్నారని హైకోర్టు ధర్మాసనం నవంబరు 2018 తీర్పులో స్పష్టం చేసింది. తాజా ఢిల్లీ పరిణామాల్లో ఎక్కడికక్కడ బారికేడ్లు, రోడ్ల దిగ్బంధనం, మెట్రో స్టేషన్ల మూసివేత, ఇంటర్నెట్ నిలిపివేత, తీవ్ర నిర్బంధం వంటి సర్కారు చర్యల్ని సుప్రీం కోర్టు కూడా తప్పుబట్టింది. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును హరించకూడదని స్పష్టం చేసింది. అయినా పోలీసులు నిరసనకారుల్ని అడ్డుకుంటూనే ఉన్నారు. జంతర్ మంతర్‌కు బదులు, దూరం గా మూడు స్థలాలను (రాంలీలా మైదాన్, బురారీ గ్రౌండ్, తూర్పు ఢిల్లీ సిబిడి (గ్రౌండ్) ధర్నాలకు, నిరసనలకు ప్రత్యామ్నాయంగా చూపించామని ప్రభుత్వ పెద్దలంటున్నారు. దారులు మూయడమే ! ప్రజాస్వామ్య పాలనా వ్యవస్థల్లో కొన్ని సమస్యలకు సంప్రదాయకమైన పరిష్కార పద్ధతులున్నాయి. అందులో సంప్రదింపులు, చర్చల ప్రక్రియ ఒకటి. ఆ పంథాకు పాలకులు మెలమెల్లగా దారులు మూసేస్తున్నారు. ఎవరితో చర్చించాలి? ఏం చర్చించాలి? అనే పెడసరపు మాటలు చెబుతున్నారు. ఏదైనా కీలక ప్రజా సంబంధ విషయంలో నిరసనకారులకు, సర్కారుకు మధ్య సయోధ్య బెడిసి, ఎడం పెరిగి, ప్రతిష్టంభన ఏర్పడినపుడు చర్చల ప్రక్రియ సాగేది. ప్రభుత్వం తరపున కొందరు పెద్దలు, నిరసన ఆందోళన కారుల తరపున కొందరు చర్చల్లో పాల్గొనేది. ఆ ఆనవాయితీయే కనుమరుగవుతోంది. అంతెందుకు నిన్నటికి నిన్న 'నీట్' పేపర్ లీక్ నిరసనల సందర్భంగా పరిస్థితి విషమించినప్పుడు కేంద్ర మంత్రులు చొరవ తీసుకొని సిజెపి ప్రతినిధులతో చర్చలు జరిపారు. విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్ కార్యరూపం దాల్చి నిరసన ఉపసంహరణ అన్నది సదరు చర్చల ఫలితంగా జరిగిందే! మరి తాజా వివాదంలో.. పరిస్థితి ఇంతదాకా వస్తుందని సర్కారు వ్యూహకర్తలు ముందు భావించినట్టు లేదు. ఇసిలో జరిగిన తప్పిదాలను గుర్తించడానికి, గుర్తించినా అంగీకరించడానికి సిద్ధపడలేదు. దాంతో తప్పును సరిదిద్దుకునే ఆలోచనే చేయడం లేదు. ఫలితంగా సమస్య పరిష్కారమయ్యే సూచనలు కనబడటం లేదు. శాంతియుత నిరసన హింస కిందకు మళ్లే ఆస్కారం లేనపుడు కూడా పోలీసులు కర్కశంగా నిరసనల్ని అణచివేస్తున్నారన్నది ఆందోళనకారుల ఆరోపణ. సందర్భాన్ని, సన్నివేశాన్ని రిపోర్టు చేస్తున్న మీడియా ప్రతినిధులు, రిపోర్టర్లను కూడా పోలీసులు అడ్డుకుంటున్నారు. ప్రత్యర్థుల కింద జమచేస్తున్నారు. అదే సమయంలో సివిల్ దుస్తుల్లో వుండి లాఠీలతో నిరసనకారులపై దాడిచేస్తూ రెచ్చిపోతున్న వారిని, కార్లలో లాఠీలు, ఇతర ఆయుధాలతో నిరసన స్థలిలో తచ్చాడుతున్న వారిని పోలీసులు చూసీచూడనట్టు ఉపేక్షిస్తున్నారు. దీనిపట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. శాంతి భద్రతల్ని కాపాడే తమ ప్రాథమిక బాధ్యతల్ని పోలీసులు ఔట్ సోర్సింగ్ చేశారా? కిరాయి గూండాల్ని అద్దెకు తెచ్చుకున్నారా? అనే వ్యంగ్య వ్యాఖ్య లూ ప్రజాక్షేత్రంలో వినిపిస్తున్నాయి. ప్రజాస్వామ్య పద్ధతులకు తిలోదకాలిచ్చి, పెడపోకడలకు పాలకులు పీటలు వేస్తున్నారని సామాజికవేత్తలు విమర్శిస్తున్నారు. చట్టబద్ధ పాలన (రూల్ ఆఫ్ లా)కు కట్టుబడాల్సిన పోలీసులు సర్కారు కట్టుబానిసల్లా పనిచేయడమేకాక విధి నిర్వహణల్లో ఉన్న జర్నలిస్టుల్ని కూడా ఆందోళన, నిరసనకారుల్లో జమచేసే దారుణానికి ఒడిగడుతున్నారు.

# 'ఎల్‌నినో'తో పొంచి ఉన్న కరవు



ఈ ఏడాది నైరుతి పవనాల సీజన్‌పై ఎల్‌నినో తీవ్ర ప్రభావం చూపడంతో సాధారణం కన్నా తక్కువ వర్షపాతం నమోదై దక్షిణాది రాష్ట్రాల్లో తాగునీటికి కొరత ఏర్పడడమే కాకుండా, కరవు పరిస్థితులు తాండవిస్తున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు రాష్ట్రాల్లో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉంది. అయినప్పటికీ అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు దక్షిణ భారతంలో ఈశాన్య రుతుపవనాల వల్ల వర్షాలు కురియవచ్చున్న ఆశ కనిపిస్తోంది. పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురిశాయి. ఒడిశాలో అత్యధిక వర్షపాతం నమోదైంది. 2015 తరువాత ఈ సంవత్సరం నైరుతి రుతుపవనాల తీరు చాలా బలహీనంగా కనిపించింది. ఎల్‌నినో బలపడుతుండడంతో వర్షపాతం మరింత తగ్గే పరిస్థితి కనిపిస్తోందన్న హెచ్చరికలు వెలువడ్డాయి. వర్షపాతం లోటు, అధిక వర్షానికి సంబంధించిన గణాంక అధ్యయనాలకు ఎంతో ప్రాముఖ్యత ఉంటుంది. కరవు ప్రకటనలు చేయడానికి ఈ గణాంకాలు ప్రభుత్వానికి సహాయ పడతాయి. అయితే గణాంకాలు ఎంత ముఖ్యమైనా, వర్షాకాలం విఫలమైనప్పుడు కలిగే నష్టాలను తగ్గించడానికి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు చురుకుగా చర్యలు తీసుకోకుంటే వాటివల్ల పెద్దగా ప్రయోజనం ఉండదు. ప్రస్తుత కరవు పరిస్థితులను ఎదుర్కోవడం అధికార యంత్రాంగానికి ఒక సవాలే. అయితే రాబోయే పరిస్థితులు మరింత కష్టతరంగా ఉంటాయని, సాధారణం కంటే ఎక్కువ వేడితో వేసవి వస్తుందని వాతావరణ అంచనాలు సూచిస్తున్నాయి. ఈ సంవత్సరం ఏర్పడిన ఎల్‌నినోను కొందరు 'సూపర్', 'సూపర్ డూపర్' అని పిలుస్తున్నా గతంలో జరిగిన ఎల్‌నినోలతో పోలిస్తే ఈ ఎల్‌నినోతో అంతటి విపత్తు సంభవించకపోవచ్చు. ఉదాహరణకు బ్రిటిష్ పాలనా కాలంలో 1877లో సంభవించిన తీవ్రమైన కరువుకు ఎల్‌నినో కూడా ప్రధాన కారణమైంది. ప్రస్తుతం భారత దేశంలో ఆహార ధాన్యాల నిల్వలు తగినంత ఉన్నాయి. దేశంలో సుమారు 602 లక్షల మెట్రిక్ టన్నుల గోధుమలు, బియ్యం నిల్వలు ఉన్నాయి. ఇది ప్రభుత్వం నిర్దేశించిన కనీస నిల్వల పరిమాణానికి మూడు రెట్లు ఎక్కువ. అందువల్ల వాతావరణ శాస్త్రవేత్తల్లో కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్టుగా వరుసగా రెండో సంవత్సరం కూడా నైరుతి పవనాలు విఫలమైనా దేశంలో ఆహార కొరత పెద్ద సమస్య కాకపోవచ్చు. కానీ దేశం లోని 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 15 ప్రాంతాలకు చెందిన భూభాగంలో, దేశం మొత్తం భూభాగంలో సుమారు 40 శాతం విస్తీర్ణానికి సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు కావడం ఆందోళన కలిగించే విషయం. నైరుతి పవనాల సీజన్ అధికారికంగా అక్టోబర్ 30న ముగుస్తుంది. కానీ ఈలోగా దేశంలోని మొత్తం 741 జిల్లాల్లో 313 జిల్లాల్లో తీవ్ర వర్షపాతం లోటు నమోదైంది. అంటే ఈ జిల్లాల్లో సాధారణంగా కురవాల్సిన వర్షపాతం కంటే 20 శాతం లేదా అంతకంటే తక్కువ వర్షం కురిసింది. ఈ నేపథ్యంలో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు తీవ్రమైన కరువు కోరల్లో చిక్కుకున్నాయి. కర్ణాటకలో వర్షపాతం లోటు 35 శాతం కాగా, మొత్తం 240 తాలూకాల్లో 217 తాలూకాలను కరవు ప్రాంతాలుగా కర్నాటక ప్రకటించింది. జాతీయ విపత్తు ప్రతిస్పందన నిధి (ఎన్‌డిఆర్‌ఎఫ్) నుంచి రూ. 11,000 కోట్లను కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో 53 శాతం వర్షపాతం లోటు నమోదైంది. ఆ రాష్ట్రం లోని మొత్తం 688 మండలాల్లో 388 మండలాలను కరవు ప్రాంతాలుగా ప్రకటించింది. అంతర్ మంత్రిత్వశాఖల బృందం ఆయా రాష్ట్రాల్లో కరవు పరిస్థితులు నెలకొన్నప్పుడు పరిశీలించి నివేదిక ఇచ్చిన తరువాత ఆయా రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం తప్పనిసరిగా సహాయం అందజేయవలసిన అవసరం ఉంది. కానీ ప్రస్తుత కరవు పరిస్థితులకు ఎల్‌నినో ఎంతవరకు ప్రత్యక్ష కారణమో, దాని ప్రభావం ఎంత బలంగా ఉందో శాస్త్రీయంగా వివరించే అధ్యయనం ఇంకా పూర్తి కాలేదు. గతంలో కరవు ప్రకటనలు తరచుగా అధికారుల వ్యక్తిగత అభిప్రాయాలు, అంచనాలపై ఆధారపడి ఉండేవి. కానీ 2009 సంవత్సరం నుంచి కరవు నిర్వహణ మాన్యువల్, దానికి చేసిన సవరణలు, ఆర్థిక సంఘాల నిర్ణయాలు కరువు ప్రకటనల ప్రక్రియను మరింత కఠినతరం చేశాయి. గతంలో ఎన్‌డిఆర్‌ఎఫ్ నుంచి ఆర్థిక సాయం విడుదల చేయడంలో కేంద్రం అనేక సార్లు తీవ్ర జాప్యం చేయడమే కాక, సహాయం అందించడానికి నిరాకరించే సందర్భాలు ఎన్నో ఉన్నాయి. 2024లో కర్ణాటక విషయంలో ఇలాంటి పరిస్థితి ఎదురైంది. రాష్ట్రప్రభుత్వాలే తమ సొంత నిధులను వెచ్చించుకోవలసి వచ్చింది. కేంద్ర బృందం పరిశీలించిన తరువాత కూడా సాయం అందించడంలో మొండి చెయ్యిచూపడం తగదు. రాష్ట్రాలను ఇబ్బందుల పాలు చేయడం, సహాయం అందించడంలో అనవసరమైన అడ్డంకులు సృష్టించే విధానాలు మానుకోవాలి. సాధారణం కంటే తక్కువ వర్షపాతం ఉన్నప్పుడు కరవును తట్టుకునే సామర్థ్యాన్ని పెంపొందించడానికి కేంద్ర ప్రభుత్వం తగిన విధంగా రాష్ట్రాలను ఆదుకోవడానికి సిద్ధం కావాలి. రైతుల అప్పుల భారాన్ని తగ్గించడం, భూమి యాజమాన్యం లేని రైతులు, వ్యవసాయ కూలీలకు సహాయం అందజేయడం రాష్ట్రాల బాధ్యత అయినప్పటికీ రాష్ట్రాలకు ఆ మేరకు నిధులు మంజూరు చేయాల్సిన బాధ్యత కేంద్రానిదే. కరవు సమస్యను ఎదుర్కోవడానికి కేవలం పెద్ద నీటి పారుదల ప్రాజెక్టులపై ఆధారపడకుండా, నీటి సంరక్షణ, తక్కువ నీటితో పండే పంటలు, వ్యవసాయ బీమా, రైతులకు ఆర్థిక సాయం వంటి స్థిరమైన పరిష్కారాలపై కేంద్ర ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించాలి.

# కల్తీకి అయ్యే ఖర్చెంత?



మనిషి బతకడానికి తిండి కావాలి. తాగడానికి నీళ్లు, శ్వాసించడానికి గాలి కావాలి. ఆరోగ్యానికి పాలు, పోషణకు పండ్లు కావాలి. ఇవన్నీ ప్రకృతి ప్రసాదించిన వరాలు. కానీ ఇప్పుడు వీటిలో ఏది స్వచ్ఛమైనది? ఏది నిర్భయంగా తినదగినది? ఏది నిశ్చింతగా తాగదగినది? అన్న ప్రశ్నలకు సమాధానం చెప్పలేని దుస్థితి నెలకొంది. ఆకలి తీర్చే ఆహారమే అనారోగ్యానికి మూలమైతే, దాహం తీర్చే నీరే రోగాలను ఆహ్వానిస్తే, ప్రాణ వాయువే ఆరోగ్యానికి శత్రువైతే మనిషి తన మనుగడను ఎక్కడ వెతుక్కోవాలి? అసలు కల్తీకి అయ్యే ఖర్చెంత? లీటరు పాలలో నీళ్లు కలపడానికి అయ్యే ఖర్చెంత? నూనెలో నాణ్యతలేని పదార్థాలు కలిపి అమ్మడానికి పెట్టుబడెంత? పండ్లను కృత్రిమంగా మగ్గించడానికి వ్యయమెంత? ఆహార పదార్థాలకు ఆకర్షణీయమైన రంగులు అద్ది, వాటి అసలు స్వరూపాన్ని దాచడానికి ఖర్చెంత? కల్తీ ద్వారా వచ్చే అదనపు ఆదాయం ఎంత? ఈ లెక్కలన్నీ వేసుకునే వ్యాపారులు, ఆ కల్తీ వల్ల ప్రజల ఆరోగ్యానికి కలిగే నష్టాన్ని ఎందుకు లెక్కించరు? పాల కల్తీ మరింత ఆందోళనకరమైన అంశం. సహజమైన పాలను పోలిన రూపం, చిక్కదనం తీసుకురావడానికి యూరియా, డిటర్జెంట్లు, ఇతర రసాయనాలను ఉపయోగించి కృత్రిమ పాలు తయారు చేసే ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. యూరియా వ్యవసాయానికి ఉపయోగపడే పదార్థమే అయినా, దానిని పాలలో కలిపి వినియోగించడం ప్రమాదకరం. పోషకాహారంగా భావించి పిల్లలకు ఇచ్చే పాలే హానికరమైన మిశ్రమంగా మారితే తల్లిదండ్రులు ఎవరిని నమ్మాలి? పసిపిల్లలు, వృద్ధుల ఆరోగ్యంతో చెలగాటమాడే ఈ దుర్మార్గాన్ని అరికట్టడానికి నిరంతర తనిఖీలు, శాస్త్రీయ పరీక్షలు, కఠిన చర్యలు ఎందుకు సమర్థంగా అమలుకావడం లేదు? కల్తీ వ్యాపారికి అది లాభం కావచ్చు. వినియోగదారుడికి మాత్రం కనిపించని నష్టం. లాభం ఒకరి జేబులో చేరితే, నష్టం మరొకరి ఆరోగ్యంపై పడుతోంది. కల్తీ ద్వారా సంపాదించిన డబ్బు వ్యాపారికి మిగులుతుంది. అనారోగ్యంతో బాధపడే వ్యక్తి మాత్రం ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ సంపాదనను కోల్పోతాడు. కుటుంబం వైద్య ఖర్చులతో ఆర్థికంగా కుంగిపోతుంది. నాణ్యతను పణంగా పెట్టి లాభాలు పెంచుకోవడం వ్యాపార చాతుర్యం కాదు; ప్రజల ప్రాణాలను పణంగా పెట్టే దురాశ. కల్తీ సమస్య పాలకో, నూనెకో పరిమితమై ఉంటే నియంత్రించడం సులభమయ్యేది. కానీ పండ్లు సహజంగా పండాయా, కృత్రిమంగా మగ్గించారా అన్న సందేహం. కూరగాయల్లో రసాయనాల అవశేషాలున్నాయా అన్న భయం. తాగునీటిలో పారిశ్రామిక వ్యర్థాలు చేరాయా అన్న ఆందోళన. మరోవైపు వాహనాల పొగ, పరిశ్రమల ఉద్గారాలు, నిర్మాణాల ధూళి గాలిని కలుషితం చేస్తున్నాయి. ఉద్దేశపూర్వక కల్తీ, నాణ్యతా లోపం, పర్యావరణ కాలుష్యం వేర్వేరు సమస్యలే అయినా, వాటి ప్రభావం చివరకు ప్రజల ఆరోగ్యంపైనే పడుతోంది. తినే పదార్థం నుంచి పీల్చే గాలి వరకు అనుమానించాల్సి వస్తే, ఆధునిక జీవితం మనకు అందిస్తున్న భద్రత ఏమిటి? స్వచ్ఛమైన వస్తువును ఎంచుకోవడానికి కూడా అదనంగా డబ్బు చెల్లించాల్సిన పరిస్థితి మరో విషాదం. సేంద్రియ పద్ధతుల్లో పండించామని చెప్పే ఉత్పత్తులు అధిక ధరలకు అమ్ముడవుతున్నాయి. ఆరోగ్యకరమైన ఆహారం సంపన్నుల ప్రత్యేక హక్కుగా మారాలా? నాణ్యమైన ఆహారం కొనలేని పేదవాడు కల్తీకి బలి కావాల్సిందేనా? స్వచ్ఛమైన గాలి, నీరు, ఆహారం కోసం ప్రజలు అదనపు వ్యయం చేయాల్సి రావడం అభివృద్ధికి నిదర్శనమా? లేక అభివృద్ధి నమూనాలోని లోపాలకు అద్దమా? ప్రకృతిలో కల్తీలేని వస్తువులు లభించడం అసాధ్యమేమీ కాదు. ఆరోగ్యకరమైన నేల, కలుషితం కాని నీరు, బాధ్యతాయుతమైన వ్యవసాయ పద్ధతులు స్వచ్ఛమైన ఆహారానికి పునాదులు. పంట పండిన తర్వాత నిల్వ, రవాణా, విక్రయాల్లోనూ నాణ్యతా ప్రమాణాలు పాటించాలి. సేంద్రియమనే ముద్ర ఉన్నంత మాత్రాన ప్రతి వస్తువూ సురక్షితమని భావించకుండా, శాస్త్రీయ పరీక్షలు, ధ్రువీకరణకు ప్రాధాన్యమివ్వాలి. ప్రకృతిని కాపాడకుండా స్వచ్ఛతను ఆశించడం సాధ్యం కాదు. ప్రభుత్వ బాధ్యత ఇక్కడ అత్యంత కీలకం. ఆహార భద్రతా చట్టాలు కాగితాలకే పరిమితం కాకూడదు. కల్తీని గుర్తించే ప్రయోగశాలలు, నిపుణులు, తనిఖీ వ్యవస్థలు బలోపేతం కావాలి. పరీక్షా ఫలితాలు వేగంగా వెల్లడించాలి. నేరాలకు పాల్పడినవారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి. కల్తీ పదార్థాలను మార్కెట్ నుంచి ఉపసంహరించుకోవాలి. పలుకుబడి ఉన్నవారు తప్పించుకునే అవకాశాలు లేకుండా చూడాలి. ప్రజల ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను బహిరంగపరచాలి. తనిఖీలు అప్పుడప్పుడు జరిగే తంతుగా కాకుండా నిరంతర పర్యవేక్షణలో భాగం కావాలి. ప్రజల అప్రమత్తత కూడా అవసరమే. ప్యాకేజీలపై తయారీ, గడువు, నాణ్యతా వివరాలను పరిశీలించాలి. అనుమానాస్పద పదార్థాల గురించి అధికారులకు తెలియజేయాలి. అయితే వినియోగదారుడి జాగ్రత్త మాత్రమే పరిష్కారం కాదు. ఏది కల్తీ, ఏది స్వచ్ఛమో గుర్తించే శాస్త్రీయ సామర్థ్యం అందరికీ ఉండదు. నాణ్యతను నిర్ధారించే వ్యవస్థను నిర్మించడం ప్రభుత్వ బాధ్యత; దాన్ని కాపాడటం ఉత్పత్తిదారుల బాధ్యత. అంతిమంగా మనం వేసుకోవాల్సిన ప్రశ్న ఒక్కటే. కల్తీని అరికట్టడానికి అయ్యే ఖర్చెంత? కల్తీని నిర్లక్ష్యం చేయడంవల్ల సమాజం చెల్లిస్తున్న మూల్యం ఎంత? తనిఖీ వ్యవస్థను బలోపేతం చేయడానికి పెట్టే నిధుల కంటే అనారోగ్యం, వైద్య ఖర్చులు, కోల్పోయిన పని దినాల రూపంలో దేశం భరిస్తున్న భారం తక్కువా? కల్తీని నిరోధించడానికి ఖర్చు చేయడం ప్రభుత్వానికి భారంగా కనిపించవచ్చు. కానీ దానిని నిర్లక్ష్యం చేయడం సమాజానికి అంతులేని భారంగా మారుతుంది. ప్రకృతి మనకు గాలిని అమ్మలేదు. నీటిలో విషం కలిపి ఇవ్వలేదు. పండ్లను కృత్రిమంగా మగ్గించి పంపలేదు. ఇవన్నీ మనిషి స్వార్థంతో సృష్టించుకున్న సమస్యలు. ప్రకృతి ఇచ్చిన వరాలను వ్యాపార దురాశకు బలిచేసి, ఆ తర్వాత స్వచ్ఛత కోసం అదనపు ధర చెల్లించే స్థితికి చేరుకోవడం నాగరికత సాధించిన ఘనత కాదు. కల్తీలేని ఆహారం విలాసం కాదు. స్వచ్ఛమైన నీరు ప్రత్యేక సౌకర్యం కాదు. కాలుష్యంలేని గాలి సంపన్నులకే దక్కాల్సిన హక్కు కాదు. ఇవి ఆరోగ్యంగా జీవించడానికి అవసరమైన కనీస హక్కులు. కల్తీ వ్యాపారి సంపాదించే అదనపు లాభం కంటే, కల్తీని అరికట్టలేక సమాజం కోల్పోతున్న ఆరోగ్యమే ఎన్నో రెట్లు ఖరీదైనది. ఆ మూల్యాన్ని ఇప్పటికైనా గుర్తించాలి. లేదంటే భావితరాలకు మనం అందించే వారసత్వం సంపద కాదు- అనారోగ్యం; ప్రకృతి కాదు- కలుషితం; జీవితం కాదు- జీవించడానికి నిరంతర పోరాటం.

# 100 మంది పై బైండ్ ఓవర్ చర్యలు




**గుంతకల్లు, అక్టోబరు 15(డ్రీమ్ టైమ్స్):**
రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సజావుగా నిర్వహించేందుకు పోలీసు శాఖ గుంతకల్లులో ముందస్తు చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా గుంతకల్లు డిఎస్పీ బాలినేని శ్రీనివాసరావు ఆదేశాల మేరకు గుంతకల్లు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ సిఐ వి. శ్రీధర్ సమక్షంలో గురువారం బైండ్ ఓవర్ చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు సుమారు వందమంది పై బైండో వర్ చర్యలు తీసుకున్నారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తులను ముందుగానే గుర్తించి, వారి కార్యకలాపాలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా పాల్గొంటూ గొడవలు సృష్టించే అవకాశం ఉన్న వ్యక్తుల గురించి ముందస్తు సమాచారం సేకరించి సంబంధిత అధికారులు ఎదుట హాజరు పరిచి, సత్ప్రవర్తనతో మెలగాలని సూచిస్తూ చట్ట ప్రకారం బైండోవర్ చర్యలు చేపడుతున్నారు. ఎవరైనా ఎన్నికల సమయంలో నేరాలకు పాల్పడేందుకు ప్రయత్నించినా, ప్రజల మధ్య వివాదాలు సృష్టించినా, బెదిరింపులకు దిగినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడినా అటువంటి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు సమస్యాత్మక వ్యక్తులపై నిఘా కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని, ఇలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా సంయమనం పాటించాలని పోలీసులు కోరారు. ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా పోలీసు శాఖకు సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.

## స్థానిక ఎన్నికలపై ఫరూక్
# ఏవీ సుబ్బారెడ్డి భేటీ
### ఎన్నికల వ్యూహాలు, పార్టీ బలోపేతంపై నేతల మధ్య చర్చ



**నంద్యాల క్రైమ్ -- డ్రీమ్ టైమ్స్ అక్టోబర్ 15, 2026**
నంద్యాల: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్‌తో ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఏవీ సుబ్బారెడ్డి భేటీ అయ్యారు. గురువారం నంద్యాలలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, స్థానిక సంస్థల ఎన్నికల కార్యాచరణపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని పలు రాజకీయ అంశాలు, ఎన్నికల వ్యూహాలు, క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను బలోపేతం చేసే అంశాలపై చర్చించినట్లు సమాచారం. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థుల విజయానికి సమన్వయంతో కృషి చేయాల్సిన అవసరంపై నేతలు చర్చించినట్లు తెలిసింది. ఈ భేటీలో కొప్పుల శివ నాగిరెడ్డి, మునగాల విశ్వనాథ్‌రెడ్డి, పబ్బతి వేణు తదితరులు పాల్గొన్నారు.

# గుంతకల్లులో స్ట్రాంగ్ రూమును పరిశీలించిన జిల్లా ఎస్పీ జగదీష్



**గుంతకల్లు, అక్టోబరు 15(డ్రీమ్ టైమ్స్):**
శుక్రవారం నుండి మున్సిపల్ సాధారణ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో గురువారం జిల్లా ఎస్పీ జగదీష్ గుంతకల్లు పట్టణంలోని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ హై స్కూల్ ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమును పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం చేరుకుని నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. అలాగే తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కూడా సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు స్థానిక మున్సిపల్ ఇంచార్జ్ కమిషనర్ ఎం లక్ష్మీదేవి, ఏసిపి శ్రీనివాసులు, డి ఈ షబానా, ఎం ఈ ఇంతియాజ్, డి.ఎస్.పి బాలినేని శ్రీనివాసరావు, వన్ టౌన్, టూ టౌన్ సీఐలు శ్రీధర్, రామారావు పలువురు ఎస్సైలు పాల్గొన్నారు.

## బీమాబాయి మహిళా మండలి ఆధ్వర్యంలో నీలపల్లి గ్రామంలో ఎంబ్రాయిడరీ శిక్షణా కేంద్రం ప్రారంభం



**తాళ్ళరేవు,అక్టోబరు 15(డ్రీమ్ టైమ్స్):**
కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం నీలపల్లి గ్రామంలో బీమాబాయి మహిళా మండలి ఆధ్వర్యంలో మహిళలకు మరియు కిషోర బాలికలకు ఎంబ్రాయిడరీ శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించిన బీమాబాయి మహిళ మండలి చీఫ్ ఫంక్షనరీ వాసంశెట్టి నందివర్ధన మాట్లాడుతూ మూడు నెలల పాటు కొనసాగే ఈ ఎంబ్రాయిడరీ శిక్షణా కేంద్రం ద్వారా మహిళలను మరియు కిషోర బాలికల నైపుణ్యాలను పెంపొందించడం ద్వారా ఆదాయ అవకాశాలను పెంచడం లక్ష్యంగా ఉందన్నారు.ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న వారికి ఎంబ్రాయిడరీ ఫ్రేములు,దారాలు,బట్టలు,కత్తెరలు,పేపర్లు పంపిణీ చేశారు.

# శ్రీశైలంలో భక్తితో బంగారు పళ్ళెం సమర్పణ



**డ్రీమ్ టైమ్స్ అక్టోబర్ 15, 2026**
**శ్రీశైలం:** శ్రీశైల మహాక్షేత్రంలో భక్తులు స్వామిఅమ్మవార్లకు విశేష కానుకలు సమర్పిస్తూ తమ భక్తిని చాటుకుంటున్నారు. ఇందులో భాగంగా గురువారం గుంటూరు జిల్లా మైడికొండూరుకు చెందిన అచంటి హరికృష్ణ దేవస్థానానికి 110 గ్రాముల బంగారు పళ్ళెంను సమర్పించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో దాత బంగారు పళ్ళెంను వేదపండితులు గంటిరాధాకృష్ణశర్మ, పర్యవేక్షకులు ఎం. శ్రీనివాసరావు, అమ్మవారి ఆలయ ఇన్‌స్పెక్టర్ కె. మల్లికార్జునకు అందజేశారు. అనంతరం దాతకు దేవస్థానం తరపున రశీదు అందజేసి, వేదపండితుల ఆశీర్వచనంతో పాటు శ్రీశైల స్వామిఅమ్మవార్ల శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు. పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీశైలంలో భక్తులు స్వచ్ఛందంగా సమర్పిస్తున్న కానుకలు భక్తిప్రపత్తులకు ప్రతీకగా నిలుస్తున్నాయి. స్వామిఅమ్మవార్ల సేవలో భాగస్వాములవుతూ భక్తులు అందిస్తున్న విరాళాలు, కానుకలు దేవస్థానంపై వారికి ఉన్న అచంచలమైన విశ్వాసాన్ని ప్రతిబింబిస్తున్నాయి.

# డాక్టర్ పోచా శ్రీకాంత్ రెడ్డి హత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు!

### శాస్త్రీయ దర్యాప్తు.. సమర్థవంతమైన ప్రాసిక్యూషన్‌తో నిందితులకు శిక్ష

**నంద్యాల క్రైమ్ । డ్రీమ్ టైమ్స్ అక్టోబర్ 15,2026**
**డోన్ :**డాక్టర్ పోచా ప్రభాకర్ రెడ్డి కుమారుడు డాక్టర్ పోచా శ్రీకాంత్ రెడ్డి హత్య కేసులో ముగ్గురు నిందితులకు కర్నూలు జిల్లా నాలుగో అదనపు సెషన్స్ న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది. శాస్త్రీయ పద్ధతుల్లో దర్యాప్తు నిర్వహించి, న్యాయస్థానంలో నేరం నిరూపించేందుకు పోలీసులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సమన్వయంతో కృషి చేశారు.

**2018లో నమోదైన కేసు.. సమగ్ర దర్యాప్తు**
డోన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 120/2018గా ఐపీసీ సెక్షన్లు 120(బీ), 420, 302, 201, 109తో పాటు 34 కింద కేసు నమోదైంది. అప్పటి డోన్ టౌన్ ఎస్ఐ శ్రీనివాసులు, డోన్ సీఐ రాజగోపాల్ నాయుడు కేసును సమగ్రంగా దర్యాప్తు చేసి న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేశారు. ఈ కేసును విచారించిన కర్నూలు జిల్లా నాలుగో అదనపు సెషన్స్ న్యాయమూర్తి లీలావతి ముగ్గురు నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ తీర్పు వెలువరించారు. ప్రభుత్వ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ప్రకాష్



రెడ్డి, శ్రీనివాస భట్ న్యాయస్థానంలో సమర్థవంతంగా వాదనలు వినిపించారు.

**కేసు విచారణలో పలువురి కీలక పాత్ర**
విచారణ సమయంలో ఎస్ఐలు శరత్ కుమార్ రెడ్డి, నరేంద్ర కుమార్ సాక్షుల విచారణలో కీలకంగా వ్యవహరించారు. కోర్టు కానిస్టేబుళ్లు అల్లి పీరా, బషీర్‌తో పాటు జమీా ఏఎస్ఐ రవి రావు, కృష్ణమోహన్ రెడ్డి కేసు విచారణ సజావుగా సాగేందుకు సహకరించారు.

**జీవిత ఖైదు పడిన నిందితులు వీరే..**

1. మురారి నరసింహ
2. మురారి చంద్రశేఖర్
3. మురారి నాగరత్న

ఈ కేసులో సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించి, న్యాయస్థానంలో శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని నంద్యాల జిల్లా ఎస్పీ, డోన్ డీఎస్పీ అభినందించారు.

తీవ్ర నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు

తీవ్రమైన నేరాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని డోన్ పట్టణ సీఐ తెలిపారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సమన్వయంతో నేర నిరూపణకు కృషి చేసి బాధితులకు న్యాయం జరిగేలా పోలీసు శాఖ పనిచేస్తుందని పేర్కొన్నారు. హత్యలు, కుట్రలు, మోసాలు, సాక్ష్యాధారాలను ధ్వంసం చేయడం వంటి నేరాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. నేరాలకు సంబంధించిన ఆధారాలను శాస్త్రీయంగా సేకరించి, సమగ్ర దర్యాప్తుతో న్యాయస్థానంలో నేరం నిరూపించేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు.

# శ్రీశైల దేవస్థానం అన్నప్రసాద పథకానికి రూ.1,01,116 విరాళం






**డ్రీమ్ టైమ్స్ । అక్టోబర్ 15, 2026 శ్రీశైలం**
శ్రీశైల క్షేత్రంలో భక్తులకు అన్నప్రసాదం అందించే పవిత్ర సేవకు భక్తులు తమ వంతు సహకారం అందిస్తున్నారు. ఈ క్రమంలో కాకినాడ జిల్లా అన్నవరం ప్రాంతానికి చెందిన శ్రీ పన్నీరుబాబ్జి గురువారం అన్నప్రసాద వితరణ పథకానికి రూ.1,01,116 విరాళంగా సమర్పించారు. దాత అందించిన విరాళాన్ని దేవస్థానం పర్యవేక్షకులు డి. మల్లికార్జునుడు స్వీకరించారు. అనంతరం దాతకు విరాళ స్వీకరణ రశీదుతో పాటు స్వామిఅమ్మవార్ల ప్రసాదాలను అందజేశారు. ఆకలితో ఉన్నవారికి అన్నం అందించడం మహోన్నతమైన సేవగా భావించే భక్తులు, శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి విరాళాలు అందించడం విశేషం. భక్తుల సహకారంతో అన్నప్రసాద సేవ మరింత మందికి చేరువవుతూ, ఆధ్యాత్మిక సేవాభావానికి ప్రతీకగా నిలుస్తోంది.

# ఘనంగా దుర్గాదేవి బోనాల పండుగ

**రామగిరి,అక్టోబర్ 15 డ్రీమ్ టైమ్స్**
రామగిరి మండలం సెంటినరీ కాలనీ జోన్ 1 లో గురువారం సాయంత్రం దుర్గాదేవికి బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండపంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవికి భక్తులు ఇంటికో బోనంతో డప్పుల చప్పుళ్లతో ఊరేగింపుగా వచ్చి నైవేద్యం సమర్పించి మొక్కులు సమర్పించారు.
అమ్మవారి కృప కటాక్షంతో ప్రజలందరూ సంతోషంగా ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో జోన్ 1 సింగరేణి కార్మిక కుటుంబాల మహిళలు, పిల్లలు,పెద్దలు,అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే తో డా.జనక్ ప్రసాద్ భేటీ



**రామగిరి,అక్టోబర్ 15 డ్రీమ్ టైమ్స్**
గురువారం న్యూఢిల్లీలోని ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే నివాసంలో తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్, ఐఎన్టీయూసీ జాతీయ కార్యదర్శి డా.జనక్ ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా శాలువాతో సత్కరించారు.
ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో ఐఎన్టీయూసీ మరియు కాంగ్రెస్ పార్టీ మధ్య ఉన్న సంబంధాలు,అలాగే తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన కీలక రాజకీయ అంశాలపై ఇరువురు చర్చించారు.

## శ్రీశైలంలో వైభవంగా ఐదో రోజు నవరాత్రి మహోత్సవాలు

మొదటి తరువాయి



దూర ప్రాంతాల నుంచి కుటుంబ సమేతంగా శ్రీశైలానికి విచ్చేసే భక్తులు స్వామివారి, అమ్మవారి దర్శనాలను సంతృప్తికరంగా చేసుకునేలా దేవస్థానంలో అందించే సేవలను మెరుగుపరిచేందుకు చైర్మన్, ఈఓ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఉత్సవాల నిర్వహణలో వివిధ విభాగాల మధ్య సమన్వయం ఉండేలా పర్యవేక్షిస్తూ, భక్తులకు అవసరమైన సదుపాయాలు అందించేందుకు దేవస్థానం యంత్రాంగం కృషి చేస్తోంది.

**స్పర్శ దర్శనం చేసుకున్న భక్తులకు రెండు ఉచిత లడ్డూలు**

శ్రీశైల మల్లన్న దర్శనానికి విచ్చేసే భక్తులకు ప్రసాదం అందించడం కూడా దేవస్థానం సేవల్లో ముఖ్యమైన భాగం. ఇప్పటికే స్పర్శ దర్శనం చేసుకున్న భక్తులకు రెండు ఉచిత లడ్డూలు అందిస్తున్నట్లు ట్రస్ట్ బోర్డు చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు గారు తెలిపారు. దర్శనంతో పాటు భక్తులకు ప్రసాదం అందించే విషయంలోనూ దేవస్థానం తగిన శ్రద్ధ తీసుకుంటోందని పేర్కొన్నారు. అన్నప్రసాద వితరణ ద్వారా భక్తులకు ఆహార సౌకర్యం కల్పించడంతో పాటు, వసతి మరియు దర్శన సదుపాయాల విషయంలోనూ ఇబ్బందులు ఎదురుకాకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు చైర్మన్ తెలిపారు. ఈఓ ఎం. శ్రీనివాసరావు గారి పర్యవేక్షణలో దేవస్థానం అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నారు.

**చైర్మన్, ఈఓ సమన్వయంతో నవరాత్రి ఉత్సవాల నిర్వహణ**

శ్రీశైల మహాక్షేత్రంలో నవరాత్రి మహోత్సవాలను సంప్రదాయబద్ధంగా, ఆధ్యాత్మిక వైభవంతో నిర్వహించేందుకు ట్రస్ట్ బోర్డు చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు గారు, ఈఓ ఎం. శ్రీనివాసరావు గారు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. అమ్మవారి వివిధ అలంకారాలు, విశేష పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు సజావుగా కొనసాగడంతో పాటు భక్తులకు అందించే సేవలు కూడా సమర్థంగా నిర్వహించేందుకు దేవస్థానం యంత్రాంగం కృషి చేస్తోంది. నవరాత్రి ఉత్సవాల సమయంలో భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించడం, అన్నప్రసాద వితరణ, వసతి వంటి సేవలను సమన్వయంతో నిర్వహించడం ద్వారా భక్తులకు మెరుగైన అనుభూతిని అందించడమే ప్రధాన లక్ష్యంగా చైర్మన్, ఈఓ ముందుకు సాగుతున్నారు. వారి పర్యవేక్షణలో దేవస్థానం అధికారులు, సిబ్బంది ఉత్సవాల నిర్వహణలో తమ వంతు బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. శ్రీశైల మహాక్షేత్ర ఆధ్యాత్మిక ప్రాశస్త్యాన్ని చాటిచెబుతూ కొనసాగుతున్న నవరాత్రి మహోత్సవాలు భక్తులలో భక్తిభావాన్ని మరింత పెంచుతున్నాయి. ఐదో రోజు స్కందమాత అలంకారంలో దర్శనమిస్తున్న భ్రమరాంబాదేవిని దర్శించుకునేందుకు భక్తులు ఆసక్తి చూపుతున్నారు. నవరాత్రి మహోత్సవాలు విజయవంతంగా కొనసాగడంతో పాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు గారు, ఈఓ ఎం. శ్రీనివాసరావు గారు సమన్వయంతో చేస్తున్న కృషి ఉత్సవాల నిర్వహణలో కీలకంగా నిలుస్తోంది.

## స్థానిక ఎన్నికలకు జిల్లా యంత్రాంగం సన్నద్ధం

మొదటి తరువాయి

అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికలు ఏకకాలంలో నిర్వహించాల్సి వస్తే ఎదురయ్యే పరిపాలనా సవాళ్లను అధిగమించేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

**అమల్లోకి వచ్చిన ఎన్నికల ప్రవర్తనా నియమావళి**

రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటనతో బుధవారం నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది. పంచాయతీ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఇది కొనసాగనుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థల అధికారులు ఎన్నికల నియమావళికి అనుగుణంగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలకు తావులేకుండా సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేపట్టనున్నారు.

ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో జిల్లా ఎన్నికల అధికారిగా కలెక్టర్, పోలీసు యంత్రాంగం ఎన్నికల నిర్వహణకు సంబంధించిన భద్రతా చర్యలపై దృష్టి సారించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

**సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా**

ఎన్నికల సమయంలో సమస్యలు తలెత్తే అవకాశం ఉన్న ప్రాంతాలు, సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని పోలీసు యంత్రాంగం భావిస్తోంది. అవసరమైన ప్రాంతాల్లో అదనపు పోలీసు బలగాలను మోహరించేందుకు చర్యలు తీసుకోనున్నారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా, ఓటర్లు ఎలాంటి భయం లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా భద్రతా ఏర్పాట్లు చేయనున్నారు. ఎన్నికల నిబంధనల అమలును పర్యవేక్షించేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్ల ఏర్పాటు, ఎన్నికల ఖర్చుల పర్యవేక్షణ, ఓటర్లను ప్రలోభపెట్టే చర్యల నియంత్రణ వంటి అంశాలపైనా అధికారులు దృష్టి సారిస్తున్నారు. నగదు, మద్యం లేదా ఇతర వస్తువుల పంపిణీ ద్వారా ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నాలను అడ్డుకునేందుకు నిబంధనల ప్రకారం నిఘా చర్యలు చేపట్టాల్సి ఉంది.

**రాజకీయ పార్టీల్లోనూ మొదలైన కదలిక**

ఎన్నికల సంఘం ప్రకటనతో రాజకీయ పార్టీల్లోనూ కదలిక మొదలైంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్న ఆశావహులు ఇప్పటికే క్షేత్రస్థాయిలో తమ వ్యూహాలకు పదును పెడుతున్నారు. గ్రామాలు, వార్డుల్లో ప్రజలతో సమావేశాలు, స్థానిక సమస్యలపై చర్చలు, పార్టీ నాయకులతో సంప్రదింపులు ప్రారంభిస్తున్నారు. రిజర్వేషన్ల ప్రకటనతో ఏ స్థానంలో ఎవరు పోటీ చేయాలనే అంశంపై రాజకీయ వర్గాల్లో చర్చలు ఊపందుకున్నాయి. ఆయా స్థానాల రిజర్వేషన్లను బట్టి అభ్యర్థుల ఎంపిక, మద్దతుదారుల సమీకరణ, ప్రచార వ్యూహాల రూపకల్పనపై పార్టీలు దృష్టి సారించనున్నాయి. త్వరలో నామినేషన్ల ప్రక్రియ, పోలింగ్ తేదీలు, ఇతర ఎన్నికల షెడ్యూల్‌కు సంబంధించిన వివరాలు స్పష్టమయ్యే కొద్దీ ప్రచారం మరింత ఊపందుకునే అవకాశం ఉంది. ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం ఒకవైపు ఏర్పాట్లు చేస్తుండగా, మరోవైపు రాజకీయ పార్టీలు తమ విజయావకాశాలను అంచనా వేసుకుంటూ వ్యూహరచనలో నిమగ్నమవుతున్నాయి. మొత్తంగా రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటనతో జిల్లాలో స్థానిక ఎన్నికల వాతావరణం నెలకొంది. ఎన్నికలను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడం జిల్లా యంత్రాంగానికి కీలకంగా మారింది.

## విజయవాడ దుర్గమ్మకు రూ.75 లక్షల విలువైన స్వర్ణ కిరీటం విరాళం

**-శ్రీకాకుళం జిల్లాకు చెందిన భక్తుడు దుర్గా శ్రీనివాస్ సమర్పణ**

**-494 గ్రాముల బంగారంతో నవరత్నాలతో కిరీటం తయారీ**

**-దసరా శరన్నవరాత్రి ఉత్సవాల వేళ ఈ కానుక అందజేత**



**విజయవాడ, అక్టోబరు 15(డ్రీమ్ టైమ్స్):** విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీ కనకదుర్గ అమ్మవారికి దసరా శరన్నవరాత్రి ఉత్సవాల వేళ భారీ కానుక అందింది. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఓ భక్తుడు సుమారు రూ.75 లక్షల విలువైన స్వర్ణ కిరీటాన్ని అమ్మవారికి విరాళంగా సమర్పించారు. వివరాల్లోకి వెళితే.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన కుర్మినాయుడు, పద్మావతమ్మ దంపతుల కుమారుడైన కె. దుర్గా శ్రీనివాస్ ఈ కిరీటాన్ని విరాళంగా ఇచ్చారు. 494 గ్రాముల స్వచ్ఛమైన బంగారంతో రూపొందించిన ఈ కిరీటంలో ఎరుపు, నీలం, తెలుపు, ఆకుపచ్చ రంగుల నవరత్నాలను పొదిగారు. దసరా ఉత్సవాల సందర్భంగా దుర్గా శ్రీనివాస్ ఈ కిరీటాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) శీనానాయక్ కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమ్మవారి ఆశీస్సులతోనే ఈ కానుకను సమర్పించానని, పవిత్రమైన నవరాత్రుల సమయంలో కిరీటాన్ని అందించడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. ప్రస్తుతం ఆలయంలో జరుగుతున్న ప్రత్యేక పూజలు, దర్శనాల నడుమ ఈ విరాళం అందడం విశేషం

## లలితా త్రిపుర సుందరిగా బెజవాడ దుర్గమ్మ.. పోటెత్తిన భక్తులు

**-అమ్మవారి దర్శనానికి తెల్లవారుజాము నుంచే పోటెత్తిన భక్తులు**

**-శ్రీచక్ర అధిష్టాన దేవతగా, మోక్ష ప్రదాయినిగా లలితా దేవికి పూజలు**

**-అమ్మవారిని దర్శించుకుని ఏర్పాట్లను ప్రశంసించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్**



**విజయవాడ,అక్టోబరు 15(డ్రీమ్ టైమ్స్):** విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో ఐదో రోజైన గురువారం కనకదుర్గమ్మ వారు శ్రీ లలితా త్రిపుర సుందరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. అమ్మవారిని ఈ రూపంలో దర్శించుకునేందుకు తెల్లవారుజామున 4 గంటల నుంచే భక్తులు భారీ సంఖ్యలో క్యూలైన్లలో వేచి ఉన్నారు.

అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు

శ్రీచక్ర అధిష్టాన దేవతగా, పంచదశాక్షరీ మంత్రానికి అధిదేవతగా లలితా దేవిని భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తారు. ప్రకృతి శక్తి స్వరూపిణి అయిన అమ్మవారిని ఈ రోజు దర్శించుకుంటే సకల సంపదలు, సౌభాగ్యాలు చేకూరుతాయని, మోక్షం సిద్ధిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. చిరునవ్వులు చిందిస్తూ, చేత చెరుకుగడను ధరించి, పరమశివుని అంకపీఠంపై ఆసీనురాలై ఉన్న అమ్మవారికి ఇరువైపులా లక్ష్మీ సరస్వతులు వింజామరలు వీస్తున్నట్లుగా ఈ అలంకారాన్ని తీర్చిదిద్దారు.రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఈ ఉదయం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దుర్గమ్మను దర్శించుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సామాన్య భక్తుల కోసం ఆలయ అధికారులు చేసిన ఏర్పాట్లు సంతృప్తికరంగా ఉన్నాయని ఆయన ప్రశంసించారు

## జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక నామినేషన్ కేంద్రాలు.. వైసీపీ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్ చేసిన హైకోర్టు

**-జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక నామినేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని వైసీపీ అభ్యర్థన**

**-నామినేషన్ల ప్రక్రియ స్వేచ్ఛగా జరగాలంటున్న పిటిషనర్**

**-కేవలం అనుమానాలతో ఆదేశాలివ్వలేమన్న ఈసీ, ప్రభుత్వం**

**-ఇతర రెండు పిటిషన్లపై విచారణ నేటికి వాయిదా**



**విజయవాడ,అక్టోబరు 15(డ్రీమ్ టైమ్స్):** స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్ల ప్రక్రియ స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేలా ఆదేశించాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దాఖలు చేసిన పిటిషన్‌పై ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో వాదనలు ముగిశాయి. ప్రతి జిల్లా కేంద్రంలో ఎన్నికల అధికారి పర్యవేక్షణలో ప్రత్యేక నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరుతూ వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. బుధవారం ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ కిరణ్మయి తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించారు.

పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది వీరా రెడ్డి వాదనలు వినిపిస్తూ..

సాధారణ నామినేషన్ కేంద్రాలు సరిపోవని, అభ్యర్థుల భద్రత దృష్ట్యా ప్రతి జిల్లా కేంద్రంలో అదనపు కేంద్రాలు అవసరమని కోర్టుకు విన్నవించారు. ఈ అంశంపై ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘానికి వినతిపత్రం సమర్పించినా ఎలాంటి స్పందన రాలేదని ఆయన ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు.

కోర్టులో వాదనలు వినిపించిన న్యాయవాదులు దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ దమ్మాల శ్రీనివాస్, ఎన్నికల సంఘం తరఫున న్యాయవాది అశ్విని కుమార్ వాదనలు వినిపించారు. నామినేషన్ల దాఖలుకు మూడు రోజుల సమయం ఉంటుందని, ఎవరైనా అడ్డుకుంటే ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసే వెసులుబాటు ఉందని తెలిపారు. కేవలం అనుమానాల ప్రాతిపదికన న్యాయస్థానం ఆదేశాలు జారీ చేయలేదని వారు స్పష్టం చేశారు. జిల్లా కేంద్రాల్లో నామినేషన్ కేంద్రాల ఏర్పాటు అనేది ఎన్నికల అధికారి విచక్షణకు లోబడి ఉంటుందని, ప్రస్తుత నిబంధనల్లో దానికి అవకాశం లేదని వివరించారు. ఇప్పటికే నామినేషన్, పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని పోలీసు ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు కోర్టుకు నివేదించారు.

**స్థానిక ఎన్నికల్లో కేంద్ర బలగాలను మోహరించాలి**

ఇదే సమయంలో, స్థానిక ఎన్నికల్లో కేంద్ర బలగాలను మోహరించాలని, కుల ధ్రువీకరణ, నిరభ్యంతర పత్రాలను సకాలంలో జారీ చేయాలని కోరుతూ వైసీపీ దాఖలు చేసిన మరో రెండు పిటిషన్లపై విచారణను జస్టిస్ వి. సుజాత గురువారానికి వాయిదా వేశారు

## దర్శి మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కేంద్రాలు పరిశీలించిన జిల్లా ఎస్పీ

**-ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు -జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు**



**దర్శి, ఒంగోలు,అక్టోబరు 15(డ్రీమ్ టైమ్స్):** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ గురువారం దర్శి మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలు,గాంధీనగర్ లోని ప్రాథమిక పాఠశాల, చింతల పాలెం లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను మరియు చెక్ పోస్ట్ వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులతో సమీక్షించారు.

**సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలి**

పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు, మౌలిక సదుపాయాలు, భౌగోళిక పరిస్థితులు, రాకపోకల మార్గాలు, రూట్ మ్యాప్‌లు, స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత తదితర అంశాలను జిల్లా ఎస్పీ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా, ప్రశాంతంగా జరిగేలా ముందస్తు ప్రణాళికతో పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు.పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్యూ లైన్ల నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, పోలీసు బందోబస్తు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. గత ఎన్నికల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తులను గుర్తించి చట్టప్రకారం ముందస్తు చర్యలు చేపట్టాలని ఎస్పీ సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో, రేపటి నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందన్నారు. ఈ క్రమంలో దర్శి మున్సిపల్ పరిధి లోని మూడు సమస్యాత్మక పోలింగ్ లొకేషన్లను సందర్శించి, ఒకే లొకేషన్ లో ఎక్కువ పోలింగ్ స్టేషన్లో ఉండటం, గతంలో జరిగిన సంఘటనలు, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకుని సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించినట్లు తెలిపారు.

**ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలి**

దర్శి మున్సిపాలిటీ పరిధిలో 28 వార్డులు, 14 పోలింగ్ లొకేషన్లు, 51 పోలింగ్ స్టేషన్లు ఉండగా, సుమారు 29 వేల మందికి పైగా ఓటర్లు ఉన్నారన్నారు. ఎన్నికల సమయంలో ఓటర్లు ప్రశాంతమైన వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసు శాఖకు, జిల్లా యంత్రాంగానికి ప్రజలు సహకరించాలని కోరారు. రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు, ప్రత్యర్థి అభ్యర్థులు సహా పోటీలో ఉన్న ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి,ఎన్నికలు పారదర్శకంగా, ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఎన్నికల ప్రక్రియ లో నిన్నటి నుంచి దర్శి మున్సిపల్ పరిధిలో మూడు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గత నెల రోజులుగా విస్తృతంగా పల్లె నిద్ర కార్యక్రమాలు, పోలింగ్ స్టేషన్ల విజిట్,సమస్యాత్మక గ్రామాల పర్యటనలు, నాన్ బెయిలబుల్ వారెంట్ల అమలు పరచటం, రౌడీషీటర్ల( చెడు నడత గల వ్యక్తులు),ట్రబుల్ మాంగర్స్ ముందస్తుగా బైండోవర్ చేయడం జరిగిందన్నారు. ఎన్నికల నిర్వహణకు ప్రశాంత వాతావరణాన్ని కల్పించి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ఎన్నికలు స్వేచ్ఛగా, శాంతి యుతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా పోలీసు శాఖ కృషి చేస్తుందని జిల్లా ఎస్పీ తెలిపారు.జిల్లా అడిషనల్ ఎస్పీ యన్.యుగంధర్ బాబు, దర్శి డిఎస్పీ బాల మురళీకృష్ణ, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, దర్శి సీఐ నాగమల్లేశ్వర రావు, , దర్శి ఎస్సై ఏడుకొండలు మరియు సిబ్బంది ఉన్నారు.

## జనసేనలో చేరిన ప్రజారాజ్యం పార్టీ మాజీ నేత బైరా దిలీప్

**-కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన పవన్ కల్యాణ్**

**-గతంలో ప్రజారాజ్యం పార్టీ తరఫున సత్తెనపల్లి నుంచి పోటీ**



**అమరావతి, అక్టోబరు 15(డ్రీమ్ టైమ్స్):** ప్రజారాజ్యం పార్టీ మాజీ నాయకుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త, బైరా ఫౌండేషన్ అధినేత బైరా దిలీప్ చక్రవర్తి జనసేన పార్టీలో చేరారు. బుధవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. నరసరావుపేట ప్రాంతానికి చెందిన దిలీప్ చక్రవర్తి, గతంలో ప్రజారాజ్యం పార్టీ తరఫున సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి ఎన్నికల బరిలో నిలిచారు.మెగా కుటుంబంతో దిలీప్ చక్రవర్తికి సుదీర్ఘ కాలంగా సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. గతంలోనూ జనసేన పార్టీతో కలిసి పనిచేసిన ఆయన, తదనంతర కాలంలో వ్యాపార వ్యవహారాలపై దృష్టి సారించేందుకు రాజకీయాలకు తాత్కాలికంగా విరామం ఇచ్చారు. తాజాగా మళ్లీ క్రియాశీల రాజకీయాల్లోకి రావాలని నిర్ణయించుకుని, ఆయన తిరిగి జనసేన గూటికి చేరారు.ఈ సందర్భంగా దిలీప్ చక్రవర్తి తాను రచించిన 'లైఫ్ హ్యాక్స్' పుస్తకాన్ని పవన్ కల్యాణ్‌కు బహూకరించారు. అనంతరం ఇరువురు నేతలు ప్రత్యేకంగా సమావేశమై పలు కీలక అంశాలపై చర్చించారు

# బిజినెస్

# త్వరలో 12% పెరగనున్న రిలయన్స్ జియో రీఛార్జ్ ప్లాన్‌లు!

**-3 నుంచి 4 నెలల్లో ధరల పెంపునకు అవకాశం**
**-సెంట్రమ్ బ్రోకింగ్ నివేదికలో కీలక అంచనా**
**-వినియోగదారులపై పెరగనున్న రీఛార్జ్ భారం**
**-సగటు ఆదాయం పెంచుకోవడమే జియో లక్ష్యం**
**-ఆన్‌లైన్ గేమింగ్‌తో పెరుగుతున్న డేటా వినియోగం**
**-వీడియో స్ట్రీమింగ్‌తో అధికమవుతున్న ఇంటర్నెట్ వాడకం**
**-ఇతర టెలికాం సంస్థలూ ధరలు పెంచే యోచన**
**-5 నెలల్లో 12 నుంచి 15 శాతం పెంపునకు అవకాశం**




రిలయన్స్ జియో వినియోగదారులకు త్వరలో రీఛార్జ్ ధరల భారం పెరిగే అవకాశం ఉంది. రాబోయే 3 నుంచి 4 నెలల్లో జియో తన టారిఫ్ ధరలను 12 శాతం వరకు పెంచవచ్చని సెంట్రమ్ బ్రోకింగ్ నివేదిక అంచనా వేసింది. అయితే, దీనిపై జియో నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు. ధరల పెంపు అమలైతే మొబైల్ వినియోగదారుల నెలవారీ ఖర్చులు పెరిగే అవకాశం ఉంది. వినియోగదారుల నుంచి వచ్చే సగటు ఆదాయాన్ని పెంచుకోవడం టెలికాం సంస్థల ప్రధాన లక్ష్యంగా మారింది. పరిశ్రమలో ఏఆర్‌పీయూ (ఒక్కో వినియోగదారుడి నుంచి వచ్చే సగటు ఆదాయం) పెంచుకునేందుకు జియో టారిఫ్‌లను సవరించవచ్చని నివేదిక పేర్కొంది. ఆన్‌లైన్ గేమింగ్, వీడియో స్ట్రీమింగ్ వంటి సేవల వినియోగం పెరగడంతో డేటా అవసరాలు కూడా అధికమవుతున్నాయి. జియోతో పాటు ఇతర టెలికాం సంస్థలు కూడా రాబోయే ఐదు నెలల్లో రీఛార్జ్ ధరలను 12 నుంచి 15 శాతం వరకు పెంచే అవకాశం ఉందని నివేదిక అంచనా వేసింది. అయితే, ఇవన్నీ ప్రస్తుతం అంచనాలే. ధరల పెంపు ఎప్పటి నుంచి అమలవుతుంది, ఏయే ప్లాన్లపై ఎంతమేర ప్రభావం ఉంటుంది అనే వివరాలు అధికారిక ప్రకటన వచ్చిన తర్వాతే స్పష్టమవుతాయి.

## తగ్గిన బంగారం వెండి ధరలు

**-పసిడి ధరలు దిగివచ్చిన వైనం**
**-22 క్యారెట్ల బంగారంపై రూ.750 తగ్గింపు**
**-24 క్యారెట్ల బంగారంపై రూ.820 తగ్గుదల**
**-10 గ్రాముల 22 క్యారెట్ల ధర రూ.1,35,150**
**-24 క్యారెట్ల పసిడి ధర రూ.1,47,440**
**-కిలో వెండిపై రూ.5,000 తగ్గింపు**
**-వెండి ధర రూ.2.40 లక్షలకు చేరిక**
**-తెలుగు రాష్ట్రాల్లోనూ ఇదే ధరల ధోరణి**



బులియన్ మార్కెట్‌లో గురువారం బంగారం, వెండి ధరలు తగ్గాయి. పసిడి కొనుగోలు చేయాలనుకునే వారికి కొంత ఊరటనిచ్చేలా ధరలు దిగివచ్చాయి. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.750 తగ్గి రూ.1,35,150కు చేరింది. అదేవిధంగా 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.820 తగ్గి రూ.1,47,440 వద్దకు దిగివచ్చింది. వెండి ధర కూడా తగ్గుముఖం పట్టింది. కిలో వెండిపై రూ.5,000 తగ్గడంతో ధర రూ.2,40,000కు చేరింది. బంగారం, వెండి ధరల్లో చోటుచేసుకున్న ఈ తగ్గుదల కొనుగోలుదారులపై కొంతమేర భారం తగ్గించనుంది. తెలుగు రాష్ట్రాల్లోనూ ఇదే ధరల ధోరణి కొనసాగనుంది. అయితే నగలు కొనుగోలు చేసే సమయంలో ఆభరణాల తయారీ ఛార్జీలు, వర్తించే పన్నుల కారణంగా తుది ధరలో మార్పులు ఉండవచ్చు. కొనుగోలుకు ముందు స్థానిక నగల దుకాణాల్లో తాజా ధరలను తెలుసుకోవడం మంచిది.

## దూసుకెళ్లిన స్టాక్ మార్కెట్..

**-1534 పాయింట్లు లాభపడ్డ సెన్సెక్స్..**
**-ఒక్కరోజే 2 శాతంపైగా లాభం**




: భారత స్టాక్ మార్కెట్ గురువారం భారీ లాభాల్లోకి దూసుకెళ్లింది. బీఎస్ఈ సెన్సెక్స్ ఏకంగా 1534 పాయింట్లు లాభపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 375 పాయింట్ల లాభాల్ని చవిచూసింది. దీంతో స్టాక్ మార్కెట్ విలువ గురువారం ఒక్కరోజే ఏకంగా 2 శాతంపైగా పెరిగింది. ఐటీ షేర్లకు మద్దతు లభించడం, అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గడం, రూపాయి విలువ పెరగడం వంటి కారణాలు మార్కెట్‌పై సానుకూల ఫలితాన్ని చూపాయి.దీంతో స్టాక్ మార్కెట్ లాభాలబాట పట్టింది. గురువారం ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 1,534 పాయింట్లు (2.11 శాతం) లాభపడి 74,315. 61 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 375 పాయింట్లు (1.66 శాతం) లాభంతో 22,997.35 వద్ద ముగిసింది. ఐటీ, బ్యాంకింగ్ స్టాక్స్ ర్యాలీ కొనసాగింది. టెక్ మహీంద్రా అత్యధికంగా 4.61 శాతం లాభపడింది. ఆ తర్వాత ఐసీఐసీఐ బ్యాంక్ 4.17 శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 4.03 శాతం, భారతీ ఎయిర్‌టెల్ 2.94 శాతం, హెచ్‌సీఎల్ టెక్ 2.58 శాతం లాభపడ్డాయి. బ్రాడర్ మార్కెట్లో నిఫ్టీ 100.. 1.26 శాతం లాభపడగా, నిఫ్టీ 200 0.93 శాతం, నిఫ్టీ 500 0.65 శాతం లాభపడగా.. నిఫ్టీ మిడ్‌క్యాప్ 50 మాత్రం 0.24 శాతం నష్టపోయింది. అలాగే, నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.36 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 1.31 శాతం నష్టాల్లో ముగిశాయి. మరోవైపు రూపాయి 0.2 శాతం బలపడింది. డాలర్‌తో రూపాయి మారక విలువ 94.92 వద్ద కొనసాగింది. అంతర్జాతీయంగా చమురు ధరలు ఒక డాలర్ పైగా తగ్గాయి. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 104 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

# స్పోర్ట్స్

## ఈ పేస్ త్రయం చాలా డేంజర్.. టెస్టుల్లో వీరిని ఎదుర్కోలేం..!



స్వదేశంలో రెండేళ్ల తర్వాత తొలి టెస్టు ఓడిపోయింది దక్షిణాఫ్రికా . మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను విజయంతో ఆరంభించాలనుకున్న సఫారీ బృందానికి ఆస్ట్రేలియా ఊహించని షాకిచ్చింది. దర్బన్ టెస్టులో 214 పరుగుల ఓటమికి మ్యాట్ రెన్‌షా సంచలన బ్యాటింగ్, జోష్ హేజిల్‌వుడ్ బౌలింగ్ ప్రధాన కారణాలు. దర్బన్‌లో తాము గొప్పగా ఆడలేకపోయామని కెప్టెన్ తెంబా బవుమా అంగీకరించగా.. టెస్టుల్లో ఆసీస్ పేస్ త్రయాన్ని ఎదుర్కోవడం చాలా కష్టమని ఫాఫ్ డూప్లెసిస్ అన్నాడు. టెస్టు క్రికెట్‌లో మళ్లీ ఆస్ట్రేలియా జోరు మొదలైంది. ఇటీవల స్వదేశంలో బంగ్లాదేశ్ చేతిలో ఓడిన ఆసీస్.. దర్బన్ టెస్టులో భారీ విజయంతో హెచ్చరికలు పంపింది. బలమైన బ్యాటింగ్ లైనప్, పటిష్టమైన పేస్ దళం ఆ జట్టు విజయంలో కీలకమయ్యాయి. దర్బన్‌లో దక్షిణాఫ్రికా ఓటమిని విశ్లేషించిన మాజీ కెప్టెన్ ఫాఫ్ డూప్లెసిస్.. కంగారూ టీమ్‌లోని మిచెల్ స్టార్క్, ప్యాట్ కమిన్స్, హేజిల్‌వుడ్ చాలా ప్రమాదకరమని అతడు అభిప్రాయపడ్డాడు. టెస్టుల్లో వీరిని ఎదుర్కోవడం చాలా కష్టమని అతడు క్రిక్‌ఇన్ఫో ఇంటర్వ్యూలో అన్నాడు.ఆస్ట్రేలియా బౌలర్లు బ్యాటర్లకు పరీక్ష పెడతారు. ముఖ్యంగా పేస్ త్రయంలోని స్టార్క్, కమిన్స్, హేజిల్‌వుడ్ చాలా డేంజర్. ఎందుకంటే.. ఈ ముగ్గురు వైవిధ్యమైన పేసర్లు. ఎడమచేతి వాటం పేసరైన స్టార్క్ కొత్త బంతిని అద్భుతంగా స్వింగ్ చేస్తాడు. అతడు తరచూ బ్యాటర్లను ఎల్బీగా ఔట్ చేసేందుకు ప్రయత్నిస్తాడు. బంతి పాతబడ్డాక రివర్స్ స్వింగ్‌తో స్టంప్స్‌ను లక్ష్యంగా చేసుకుంటాడు మిచెల్ స్టార్క్. కమిన్స్ విషయానొకొస్తే కచ్చితత్వంలో కూడిన బౌలింగ్ అతడిది. స్టంప్స్‌ను టార్గెట్ చేస్తాడు. డిఫెన్స్‌లో బలహీనంగా ఉన్న బ్యాటర్లను వణికిస్తాడు. ముఖ్యంగా నుదిటిని తాకేలా పదునైన బౌన్సర్లు సంధిస్తాడు. పొడగరి అయిన హేజిల్‌వుడ్ అదనపు బౌన్స్ రాబట్టగలడు. అతడు కూడా కచ్చితత్వంతో బౌలింగ్ చేస్తాడు. మొత్తంగా ఈ ముగ్గుర టెస్టుల్లో ఆస్ట్రేలియా పాలిట గెలుపు గుర్రాలు. సంప్రదాయ క్రికెట్ షాట్లతోనే వీరిని కాస్త నిలువరించవచ్చు' అని డూప్లెసిస్ పేర్కొన్నాడు.

రెండు నుంచి మూడుకు

ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో అగ్రస్థానంలో ఉన్న ఆస్ట్రేలియా దర్బన్ టెస్టులో ఘన విజయం సాధించింది. గత సీజన్ విజేత దక్షిణాఫ్రికాను అనూహ్యంగా కంగుతినిపించిన ఆసీస్ మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. నాలుగో ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లతో చెలరేగిన హేజిల్‌వుడ్ కెరీర్లో అత్యుత్తమ గణాంకాలు నమోదు చేశాడు. ఫలితంగా 214 పరుగుల తేడాతో ఓడిన సఫారీ టీమ్ డబ్ల్యూటీసీలో రెండో స్థానం నుంచి మూడుకు పడిపోయింది. న్యూజిలాండ్ రెండుకు ఎగబాకింది. ఈ సిరీస్‌లో కీలకమైన రెండో టెస్టు అక్టోబర్ 18, ఆదివారం నుంచి గెబెర్హాలోని సెయింట్ జార్జ్ పార్కులో జరుగనుంది.

## శ్రీలంకకు గట్టి ఎదురుదెబ్బ

**-గాయం నుంచి కోలుకోని పథుమ్ నిశాంక**
**-తొడ కండరాల గాయంతో సిరీస్‌కు దూరం**
**-అతడి స్థానంలో లహిరు ఉడారకు అవకాశం**
**-అక్టోబర్ 18 నుంచి ముక్కోణపు వన్డే సిరీస్**
**-పాక్, ఇంగ్లండ్‌తో తలపడనున్న శ్రీలంక**
**-నవంబర్ టెస్టు సిరీస్‌లోగా కోలుకోవాలని ఆశలు**
**-శ్రీలంక వన్డే జట్టులో 16 మంది ఆటగాళ్లు**




ముక్కోణపు వన్డే సిరీస్ ఆరంభానికి ముందే శ్రీలంక జట్టుకు ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ ఓపెనర్ పథుమ్ నిశాంక గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోవడంతో టోర్నీకి దూరమయ్యాడు. అతడి స్థానంలో అన్‌క్యాప్డ్ ఆటగాడు లహిరు ఉడారను సెలెక్టర్లు ఎంపిక చేశారు. అక్టోబర్ 18 నుంచి పాకిస్థాన్ వేదికగా ప్రారంభం కానున్న ఈ సిరీస్‌లో శ్రీలంక, పాకిస్థాన్, ఇంగ్లండ్ జట్లు తలపడనున్నాయి. ఇంగ్లండ్ వేదికగా జరిగిన ముక్కోణపు టీ20 సిరీస్‌లో గాయపడిన నిశాంక ఇంకా పూర్తి ఫిట్‌నెస్ సాధించలేదు. తొడ కండరాల గాయంతో బాధపడుతున్న అతడికి వైద్యులు ఫిట్‌నెస్ ధ్రువపత్రం ఇవ్వలేదు. దీంతో కీలకమైన వన్డే సిరీస్‌కు అతడు అందుబాటులో లేకుండా పోయాడు. ఓపెనర్‌గా జట్టుకు శుభారంభాలు అందిస్తాడని భావించిన నిశాంక దూరం కావడం శ్రీలంకకు ఇబ్బందికరంగా మారింది. నిశాంక స్థానంలో ఎంపికైన లహిరు ఉడారకు అంతర్జాతీయ క్రికెట్‌లో పరిమిత అనుభవమే ఉంది. ఇప్పటివరకు ఐదు టెస్టులు, ఏడు టీ20లు ఆడిన అతడికి వన్డేల్లో అవకాశం దక్కడం కీలకంగా మారింది. ఈ సిరీస్‌లో అతడు ఎలా రాణిస్తాడన్నది ఆసక్తికరంగా మారింది. మరోవైపు, నవంబర్ 9 నుంచి ప్రారంభం కానున్న పాకిస్థాన్‌తో రెండు టెస్టుల సిరీస్‌కు నిశాంక ఎంపికయ్యాడు. అప్పటిలోగా గాయం నుంచి కోలుకుని పూర్తి ఫిట్‌నెస్ సాధిస్తాడని శ్రీలంక క్రికెట్ వర్గాలు ఆశిస్తున్నాయి.

**శ్రీలంక వన్డే జట్టు:** కుశాల్ మెండిస్ (కెప్టెన్), అవిష్క ఫెర్నాండో, కమిందు మెండిస్, జనిత్ లియనగే, పవన్ రత్ననాయకే, సహన్ అరచ్చిగే, దసున్ శనక, కమిల్ మిషార (వికెట్ కీపర్), లహిరు ఉడార, దునిత్ వెల్లలాగే, మహీష్ తీక్షణ, సచిందు కొలొంబగే, దుష్మంత చమీర, అసిత ఫెర్నాండో, మదుశనక, ఇషాన్ మలింగ.

## భారత్ పర్యటనలో షాయ్ హోప్ అద్భుత ప్రదర్శన

**-వన్డేలు, టీ20ల్లో వరుస శతకాలతో దూకుడు**
**-టీ20 సిరీస్‌లో రెండు సెంచరీలు నమోదు**
**-ఉప్పల్‌లోనూ భారత బౌలర్లపై విరుచుకుపాటు**
**-పర్యటనలో మూడోసారి మ్యాచ్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు**
**-అవార్డులు విమాన ప్రయాణంలో బరువవుతాయంటూ చమత్కారం**
**-గువాహటిలో 104, చండీగఢ్‌లో 162 నాటౌట్**
**-చివరి మ్యాచ్‌లోనూ సత్తా చాటాలని పట్టుదల**




భారత గడ్డపై వెస్టిండీస్ కెప్టెన్ షాయ్ హోప్ పరుగుల వరద పారిస్తున్నాడు. వన్డేల్లోనే కాకుండా టీ20ల్లోనూ సెంచరీలతో చెలరేగుతూ భారత బౌలర్లకు సవాల్ విసురుతున్నాడు. ఉప్పల్ స్టేడియంలోనూ అద్భుత శతకంతో ఆకట్టుకున్న హోప్.. ఈ పర్యటనలో మూడోసారి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డును అందుకున్నాడు. అయితే వరుసగా అవార్డులు అందుకుంటున్న ఆనందంతో పాటు వాటిని స్వదేశానికి ఎలా తీసుకెళ్లాలనే ఆలోచన కూడా తనకు ఉందంటూ సరదాగా వ్యాఖ్యానించాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులు కొంత బరువుగా ఉంటాయని హోప్ చమత్కరించాడు. స్వదేశానికి తిరిగి వెళ్లే సమయంలో విమానాశ్రయంలో లగేజీ బరువును చూసుకోవాల్సి ఉంటుందని, అవార్డుల కారణంగా అదనపు బరువు సమస్య ఎదురయ్యే అవకాశం ఉందని నవ్వుతూ చెప్పాడు. మైదానంలో పరుగులతో ప్రత్యర్థిని ఇబ్బంది పెడుతున్న హోప్.. ఇప్పుడు అవార్డుల బరువుపై చేసిన వ్యాఖ్యలతోనూ అభిమానులను అలరిస్తున్నాడు. భారత పర్యటనలో హోప్ వన్డేల్లోనూ అద్భుతంగా రాణించాడు. గువాహటిలో 104 పరుగులు, న్యూచండీగఢ్‌లో 162 పరుగులతో నాటౌట్‌గా నిలిచి భారత బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శించాడు. వరుస వన్డేల్లో సెంచరీలు సాధించి వెస్టిండీస్ జట్టుకు కీలక పరుగులు అందించాడు. ఫార్మాట్ మారినా హోప్ జోరు మాత్రం తగ్గలేదు. టీ20 సిరీస్‌లో రాంచీలో 102 పరుగులతో నాటౌట్‌గా నిలిచిన అతడు, హైదరాబాద్‌లోని ఉప్పల్ మైదానంలోనూ 102 పరుగులతో అజేయంగా నిలిచాడు. రెండు సెంచరీలతో జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. చివరి మ్యాచ్‌లోనూ ఇదే దూకుడు కొనసాగించి జట్టుకు విజయాన్ని అందించాలనే పట్టుదలతో ఉన్నాడు.

# లాయర్‌గా కీర్తి సురేష్..
# ఆసక్తికరంగా 'సత్యవాన్ సావిత్రి' టీజర్!




నేషనల్ అవార్డ్ విన్నింగ్ హీరోయిన్ కీర్తి సురేష్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'సత్యవాన్ సావిత్రి' . ప్రవీణ్ ఎస్. విజయ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన అఫీషియల్ టీజర్ తాజాగా విడుదలైంది. కామెడీ, కోర్టు డ్రామా మరియు లీగల్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమాపై టీజర్‌తో భారీ అంచనాలు నెలకొన్నాయి. చిన్నప్పటి నుంచి లాయర్ కావాలనే కసితో, ఫ్యామిలీని ఎదురించి లా చదివిన 'సావిత్రి' అనే యువతి పాత్రలో కీర్తి సురేష్ నటిస్తున్నారు. తను టేకప్ చేసిన తొలి కేసులో ఆమె ఎదుర్కొనే సవాళ్లు, కోర్టులో జడ్జిలకు ఆమె చేసే అమాయకపు వాదనలు టీజర్‌లో నవ్వులు పూయిస్తున్నాయి. ఈ చిత్రంలో మరో ప్రధాన ఆకర్షణ ప్రముఖ దర్శకుడు, నటుడు మిస్కిన్ కాగా, సావిత్రికి ఎదురుగా కోర్టులో వాదించే పవర్‌ఫుల్ లాయర్ 'మార్కండేయన్' పాత్రలో ఆయన కనిపించనున్నారు. కీర్తి సురేష్ మరియు మిస్కిన్ మధ్య జరిగే కోర్టు రూమ్ వార్ సినిమాకే హైలైట్‌గా నిలవనుంది. ఈ చిత్రంలో కీర్తి సురేష్, మిస్కిన్‌లతో పాటు చారుకేశ్, బాల శరవణన్, శిల్పా మంజునాథ్, బాలాజీ శక్తివేల్, ఆర్. సుందర్‌రాజన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకు సామ్ సి.ఎస్ సంగీతం అందిస్తుండగా, అరుణ్ విన్సెంట్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. జీ స్టూడియోస్ మరియు డ్రమ్‌స్టిక్స్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. సీరియస్ కోర్టు రూమ్ డ్రామాను కూడా చక్కటి వినోదం, హ్యూమర్‌తో మిక్స్ చేసి తెరకెక్కించిన ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా నవంబర్ 20, 2026 న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు.

# యూట్యూబ్‌లో దూసుకుపోతున్న 'హైందవ' టీజర్..
# రికార్డు స్థాయిలో వ్యూస్‌తో మాస్ రెస్పాన్స్!




బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా, సంయుక్త హీరోయిన్‌గా నటిస్తున్న తాజా పాన్ ఇండియా చిత్రం 'హైందవ' అఫీషియల్ టీజర్ యూట్యూబ్‌లో రికార్డు స్థాయి స్పందనతో దూసుకుపోతోంది. లూధీర్ బైరెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా టీజర్ విడుదలైన కేవలం 16 గంటల్లోనే 8,65,523 పైచిలుకు వ్యూస్‌ను సొంతం చేసుకుని ట్రెండింగ్‌లో నిలిచింది. రంగాపురం అనే గ్రామంలోని పురాతన ఆలయంలో పది దైవ విగ్రహాలు ఒక్కసారిగా మాయమవడం, అదే సమయంలో గ్రామంలో ఓ వ్యక్తి దారుణంగా హత్యకు గురికావడంతో ఈ కథ ప్రారంభమవుతుంది. ఈ మిస్టరీ మరియు క్రైమ్ ఇన్వెస్టిగేషన్‌ను చేధించడానికి దేవుడి కంటే మానవత్వం, హేతువాదంపై నమ్మకం ఉండే ఓ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ రగ్గడ్ లుక్‌లో కనిపించి ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. ఈ చిత్రంలో మహేష్ మంజ్రేకర్ ఆలయ పూజారిగా నటిస్తుండగా, సౌరభ్ సచ్‌దేవా, జేడీ చక్రవర్తి, శివాజీ రాజా, గెటప్ శ్రీను తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. సామ్ సి.ఎస్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని మూన్‌షైన్ పిక్చర్స్ పతాకంపై మహేష్ చందు నిర్మిస్తున్నారు. ఆధ్యాత్మికత, క్రైమ్, నమ్మకాల ఆధారంగా తెరకెక్కుతున్న ఈ మిస్టికల్ డివోషనల్ థ్రిల్లర్ చిత్రాన్ని నవంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. టీసర్‌లో వచ్చే "జరగబోయేది చెప్పి.. అది ఎలా జరుగుతుందో కళ్లారా చూపించేవాడే దేవుడు" వంటి డైలాగ్స్ సినిమాపై అంచనాలను మరింత పెంచేశాయి.

# కథలు నచ్చక.. కాస్త విరామం..!

**మృణాల్‌ఠాకూర్**

తొమ్మిది నెలలుగా తాను ఒక్క చిత్రాన్ని కూడా అంగీకరించలేదని అగ్ర కథానాయిక మృణాల్ ఠాకూర్ స్పష్టం చేసింది. అల్లు అర్జున్ 'రాకా' చిత్రంలో ఈ భామ కీలక పాత్రను పోషిస్తుందనే వార్తలొస్తున్నాయి. ఈ నేపథ్యంలో మృణాల్ ఠాకూర్ తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. 'గత తొమ్మిది నెలలుగా ఏ సినిమాకూ సంతకం చేయలేదు. ఆఫర్లు బాగానే వస్తున్నాయి. కానీ కథలు నా మనసుకు నచ్చడం లేదు. అందుకే సినిమాలకు విరామం తీసుకున్నా. ఒక సినిమా కోసం మూడునాలుగు నెలల సమయాన్ని వెచ్చించాల్సి వస్తున్నది. అంత సమయాన్ని కేటాయిస్తున్నామంటే కథలో ఏదో ఒక ప్రత్యేకత ఉండాలి కదా' అని మృణాల్ ఠాకూర్ చెప్పుకొచ్చింది. 'రాకా' సినిమాలో మృణాల్ ఠాకూర్ నటిస్తున్నదని, ఆమె షూటింగ్‌లో కూడా పాల్గొంటున్నదని ముంబై సినీ వర్గాల్లో కథనాలు వెలువడ్డాయి. అయితే ఈ విషయంపై ఇప్పటివరకూ చిత్రబృందం ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.



# పుట్టినరోజున సాయిదుర్గా తేజ్ కొత్త సినిమా ప్రకటన..

'సేవ్ ది టైగర్స్' దర్శకుడితో మెగా హీరో!




టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మెగా హీరో సాయిదుర్గా తేజ్ (సాయిధరమ్ తేజ్) తన తదుపరి సినిమాతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. విభిన్నమైన కథలను ఎంచుకుంటూ ముందుకు సాగుతున్న ఈ యువ హీరో, తన కెరీర్‌లో 19వ చిత్రానికి సంబంధించిన కీలక ప్రకటనతో అభిమానుల్లో ఆసక్తి పెంచారు. తన పుట్టినరోజు సందర్భంగా ఈ కొత్త ప్రాజెక్ట్‌ను ప్రకటించడంతో మెగా అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ చిత్రాన్ని నిర్మించనుండగా, 'సేవ్ ది టైగర్స్' వెబ్ సిరీస్‌తో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు తేజ కనుమ ఈ సినిమాకు దర్శకత్వం వహించనున్నారు. ఓటీటీ ప్రేక్షకులను ఆకట్టుకున్న 'సేవ్ ది టైగర్స్' సిరీస్‌కు దర్శకత్వం వహించిన తేజ కనుమతో సాయిదుర్గా తేజ్ సినిమా చేయబోతుండటం ఆసక్తికరంగా మారింది. కుటుంబ సంబంధాలు, హాస్యం, వినోదానికి ప్రాధాన్యమిచ్చే కథలతో గుర్తింపు తెచ్చుకున్న ఈ దర్శకుడు.. ఇప్పుడు వెండితెరపై మెగా హీరోను ఎలా చూపించబోతున్నారనే చర్చ మొదలైంది. ఈ ఇద్దరి కలయికలో రూపొందనున్న సినిమా ఎలాంటి కథాంశంతో తెరకెక్కనుంది? సాయిదుర్గా తేజ్‌ను దర్శకుడు ఏ తరహా పాత్రలో చూపించనున్నారు? అనే వివరాలు ఇంకా వెల్లడికావాల్సి ఉంది. చిత్రబృందం ప్రస్తుతానికి హీరో, దర్శకుడు, నిర్మాణ సంస్థకు సంబంధించిన వివరాలను ప్రకటించగా, మిగిలిన నటీనటులు, సాంకేతిక బృందం, సినిమా కథాంశంపై మరింత సమాచారం రావాల్సి ఉంది. సాయిదుర్గా తేజ్ కెరీర్‌లో ఈ చిత్రం 19వ సినిమాగా నిలవనుంది. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ వంటి ప్రముఖ నిర్మాణ సంస్థ ఈ ప్రాజెక్టును నిర్మిస్తుండటంతో సినిమాపై ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలను చిత్రబృందం దశలవారీగా వెల్లడించే అవకాశం ఉంది. మరోవైపు సాయిదుర్గా తేజ్ ప్రస్తుతం 'సంబరాల ఏటిగట్టు' సినిమాతో బిజీగా ఉన్నారు. ఈ చిత్రంపై కూడా అభిమానుల్లో అంచనాలు ఉన్నాయి. ఈ సినిమా వచ్చే ఏడాది విడుదల కానున్నట్లు సమాచారం. ఒకవైపు ఈ ప్రాజెక్ట్‌పై దృష్టి సారిస్తూనే, మరోవైపు కొత్త సినిమాను ప్రకటించడం ద్వారా తన తదుపరి ప్రయాణానికి ఆయన ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. పుట్టినరోజు సందర్భంగా కొత్త సినిమా ప్రకటన రావడంతో అభిమానులు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. 'సేవ్ ది టైగర్స్' దర్శకుడు తేజ కనుమతో సాయిదుర్గా తేజ్ చేయనున్న ఈ కొత్త చిత్రం ఎలాంటి వినోదాన్ని అందించనుంది? మెగా హీరోను దర్శకుడు ఏ కొత్త కోణంలో చూపించబోతున్నారు? అనే ప్రశ్నలకు సమాధానాలు తెలియాలంటే మరిన్ని అధికారిక వివరాలు వచ్చే వరకు వేచి చూడాలి.

# రూ.2500 కోట్లకు పైగా వసూళ్లు..

ఓటీటీలోకి రాబోతున్న 'అబ్సెషన్ అన్‌కట్ వెర్షన్'




హాలీవుడ్‌తో పాటు వరల్డ్ వైడ్ బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించిన హర్రర్ థ్రిల్లర్ 'అబ్సెషన్' డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. కర్రీ బార్కర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ.2,500 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి సినీ విశ్లేషకులను సైతం విస్మయపరిచింది. కేవలం రూ.9 కోట్ల బడ్జెట్‌తో రూపొంది, బాక్సాఫీస్ వద్ద అసాధారణ విజయాలను నమోదు చేసిన ఈ చిత్రం ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు వస్తోంది. ఈ చిత్రానికి సంబంధించిన 'అబ్సెషన్: ది ఒరిజినల్ అన్‌కట్ వెర్షన్' జియో హాట్‌స్టార్ వేదికగా స్ట్రీమింగ్ కానుంది. అక్టోబర్ 30వ తేదీన సాయంత్రం 7 గంటల నుంచి ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ అందుబాటులోకి రానుంది. ముఖ్యంగా ఇంగ్లీష్‌తో పాటు హిందీ భాషల్లోనూ ఈ చిత్రం విడుదలవుతుండటంతో సినీ ప్రియులు దీన్ని వీక్షించేందుకు అమితాసక్తిగా ఎదురుచూస్తున్నారు. మైఖేల్ జాన్సన్, ఇందే నవారెట్టే ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సైకలాజికల్ థ్రిల్లర్, థియేటర్లలోనే కాకుండా ఓటీటీలో కూడా సరికొత్త రికార్డులను సృష్టించేందుకు సిద్ధమవుతోంది.

# అమ్మ కదిలి వచ్చే..



సంకల్ప్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ పతాకంపై శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్నారు. క్రీ.శ. 642 నాటి కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. 'అమ్మ కదిలి వచ్చే' పాటకు అనుదీప్‌దేవ్ సంగీతాన్నందించారు. కల్యాణ్‌చక్రవర్తి త్రిపురనేని ఈ పాటకు సాహిత్యాన్ని సమకూర్చారు. దుర్గాదేవి ఆరాధనలోని వైభవాన్ని ఆవిష్కరిస్తూ ఈ పాట సాగింది. ఇందులో శూలాంభ అమ్మవారి ఉత్సవ ఊరేగింపును చూపించారు. శైలపుత్రి, బ్రహ్మచారిణి, చంద్రఘంట, కూష్మాండ, స్కందమాత, కాత్యాయని, కాళరాత్రి, మహాగౌరి, సిద్ధిధాత్రి...వంటి అమ్మవారి తొమ్మిది రూపాలను ఈ పాటలో వేడుకగా చూపించడం ప్రధానాకర్షణగా నిలిచింది. నాయకానాయికలు గోపీచంద్, రీతూవర్మ ఈ పాటలో అద్భుతంగా కనిపించారు. ఈ సినిమా చిత్రీకరణ తుదిదశకు చేరుకుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: అనుదీప్‌దేవ్, దర్శకత్వం: సంకల్ప్.

Printer. Publisher and owned by Dr k Soumya, and printed it kalanjali offset printers, shop no.23, sowjanya complex, N.K road , Srinivas Nagar, nandyal-518501 shop no 7, Sai revenue complex, mro office complex, nandyal town -518501 nandyal district (AP) editor: Dr k Sowmya. Email: editor@dream Times.in, editor@dream Times.co.in, cell:8500066609,RNI NO:APTEL 2021/81831